ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

గురువారం 6 మార్చి 2025

ఇది.. లైఫ్ టైం సీనియారిటీ లిస్టు...!

- టీచర్లు, హెచ్ఎంలకు అత్యంత కీలకమైనది
- అభ్యంతరాలుంటే... 10లోపు తెలియజేయండి
- కడప ఆర్జేడీ శామ్యూల్



7

ఇంజనీర్ల కక్కుర్తి

- జలవనరుల శాఖలో అద్దె వాహనాల గోల్‌మాల్
- నిబంధనలకు విరుద్ధంగా వైట్‌బోర్డు వాహనాల వినియోగం
- బిల్లు మాత్రం ఎల్లోబోర్డు వాహనాల పేరిట డ్రా
- ఏటా రూ.కోట్ల నిధులు స్వాహా
- బదిలీపై వెళ్లిన ఈఈపై విచారణ

6



మానవత్వంతో సేవ చేయండి

కొత్త వైద్యులకు కలెక్టర్ సూచన

పండుగ వాతావరణంలో స్నాతకోత్సవం



7

అంతా మాయ !

పురంలో నకిలీ సిత్రాలు

ఆధారాలు మార్చి భూవిక్రయాలు

వైసీపీ హయాంలో దందా

ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న వైనం

హిందూపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): భూముల విలువ పెరగడంతో హిందూపురంలో ప్రాంతంలో కొందరు నకిలీ పత్రాలు పెట్టి క్రయ విక్రయాలు జరుపుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో పాగావేసి అందినకాడికి దండుకుంటున్నారు. హిందూపురంలో ఓ చిత్తుకాగితాన్ని కూడా అధికారిక ధ్రువపత్రంగా మార్చేసి డబ్బులు గుంజుకుంటున్నారు. మోసపోయిన బాధితులు లబోదిబోమంటున్నారు.

ఆధారాలు మార్చి భూవిక్రయాలు

హిందూపురంలో భూములకు సంబంధించిన పత్రాలు మార్చడమేకాక ఆధారాలు సైతం మార్చేసి, ఒకరి స్థానంలో మరొకరి పేరు చేర్చి భూములు లాగేసుకుంటున్నారు. ఇందుకు ఉదాహరణలు అనేకం ఉన్నాయి.

- హిందూపురం మండలం కొట్నూరువద్ద ఏడాది కిందట ఒకరి భూమిలో వేరేవారు ప్లాట్లువేసి విక్రయించారు. అయితే ఆ భూమికి సంబంధించిన యజమాని ఉండగా వేరొకరి పేరుమీద పత్రాలు సృష్టించి వారే భూయజమాని అంటూ క్రయవిక్రయాలు చేశారు.
- మణేసముద్రం వద్ద ప్రైవేట్ భూమిలో పట్టాలు ఇచ్చేసి లక్షలు కాజేశారు. కొల్లకుంట ఇందిరమ్మ కాలనీలో పదుల సంఖ్యలో ఇంటిపట్టాల పత్రాలను ఫోర్జరీచేసి వేరే వ్యక్తుల పేరుతో అమ్మకాలు జరిపారు.



నకిలీ ఆధార్



అసలైన ఆధార్

- కిరికెర పంచాయతీ పరిధిలో గత నాలుగేళ్లకాలంలో పదుల సంఖ్యలో ఇంటిపట్టాలను వేరే వ్యక్తుల పేరిట మార్చేశారు. ఇందుకు కొంతమంది రెవెన్యూ అధికారులు సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి.
- మూడు రోజుల కిందట కిరికెర పంచాయతీ పరిధిలో సర్వేనంబరు 243-2లో ప్లాట్‌నంబరు 91 స్థలం మార్కెట్‌లో రూ.10లక్షలు ఉంది. కానీ సువర్ణమ్మ అనే స్థల యజమానికి తెలియకుండానే మరొకరి ఆధార్ పెట్టి ఆమె స్థలం యజమాని అంటూ అమ్మేశారు. ఆలస్యంగా గుర్తించిన బాధితులు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తప్పుడు ఆధార్ పత్రాలు సృష్టించి భూ క్రయ విక్రయాలు జరుపుతున్న ముఠాను అరెస్ట్ చేశారు. వారు హిందూపురం పట్టణం, మండలంలో ఇలాంటివాటికి పాల్పడినట్లు సమాచారం. ఇవి వెలుగులోకి వచ్చినవి మాత్రమే, రానివి చాలానే ఉన్నాయి.

గుట్టుచప్పుడు కాకుండా దందా

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు కొంతమంది రెవెన్యూ అధికారుల సాయంతో భూదందాకు పాల్పడినట్లు తెలుస్తుంది. ఐదేళ్లలో సుమారు 1500నుంచి రూ.2వేలు ఇంటి పట్టాలకు సంబంధించి ఫేక్ పత్రాలు సృష్టించి క్రయవిక్రయాలు జరిపినట్లు సమాచారం. హిందూపురం పట్టణం, మండలంలో కోట్లాది రూపాయలు విలువ చేసే ఆస్తులు ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలతో కొల్లగొట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దందా గుట్టుచప్పుడు కాకుండా సాగింది.

ఒక్కొక్కటే వెలుగులోకి..

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక హిందూపురంలో జరిగిన భూదందాలు, కబ్జాలపై బాధితులు నోరువిప్పుతున్నారు. దీంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేసి, బాధ్యులను కటకటాలపాలు చేస్తున్నారు. అయితే పోలీస్ స్టేషన్‌లకు ఇటీవల కాలంలో భూపంచాయతీలకు సంబంధించిన బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. కానీ ఉన్నతాధికారులు సివిల్ పంచాయతీల్లో తలదూర్చకూడదని చెప్పడంతో పోలీసులు ఒక్క అడుగు వెనకేస్తున్నారు. అయితే కొంతమంది బాధితులు పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేయడంతో కొన్నింటిపైనే కేసులు నమోదుచేసి దర్యాప్తు చేపడుతుండగా వారి విచారణలో దిమ్మతిరిగే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నట్లు తెలుస్తుంది.

న్యాయం చేస్తాం



ఎవరైనా స్థలాలుకానీ భూములుకానీ కొనుగోలు చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు పత్రాలు చూసుకోవాలి. అవసరమైతే సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలోకానీ, న్యాయవాదులతోగాని సలహా తీసుకోవాలి. ఆ తర్వాతే కొనుగోలు చేయాలి. ఎవరైనా మోసం చేసినట్లు గుర్తిస్తే నిజమైన ఆధారాలు ఇస్తే బాధితులకు న్యాయం చేస్తాం.

-ఆంజనేయులు, సీఐ, అప్‌గ్రేడ్ స్టేషన్ హిందూపురం



మాట్లాడుతున్న డీఈఓ కిష్టప్ప

బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ: డీఈఓ

కొత్తచెరువు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో జరుగుతున్న దాడుల నేపథ్యంలో బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు డీఈఓ కిష్టప్ప తెలిపారు. స్థానిక బాలికల ఉన్నతపాఠశాలలో రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ కిష్టప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత, జడ్పీ హైస్కూల్, కేజీబీవీ, మోడల్‌స్కూల్, మున్సిపల్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, జూనియర్ కళాశాలలోని విద్యార్థినులకు సెల్ఫ్‌డిఫెన్స్ శిక్షణ ఇస్తారన్నారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు 478 పాఠశాలలో 33,118 మంది బాలికలకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణపై ఆయా పాఠశాలల హెచ్ఎంలు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాస్టర్స్ హేమంత్, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

215 మంది గైర్హాజరు

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కొత్తచెరువు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం జరిగిన సెకెండియర్ ఇంగ్లిషు పేపర్-2 పరీక్షలకు 215 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ రఘునాథరెడ్డి తెలిపారు. 42 కేంద్రాలలో 9221 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 9045 మంది రాశారని, 176 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ పరీక్షలకు 1148 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1109 మంది రాశారని 39 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. పెనుకొండలోని రెండు కేంద్రాలను తనిఖీ చేసినట్లు వెల్లడించారు.

సారాకు దూరంగా ఉండాలి

కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నాటు సార మహమ్మారికి దూరంగా ఉండి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఆవరణంలో బుధవారం జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలనపై నవోదయం 2.0కార్యక్రమానికి సంబంధించి ఏర్పాటు చేసి ప్రచార రథాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారా నిర్మూలనకు ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. నాటుసారా వలన జరిగే అనర్థాలపై కళాబృందం ఆధ్వర్యంలో చైతన్య రథం గ్రామాల్లో తిరిగి ప్రజలను చైతన్య పరుస్తుందన్నారు. ప్రజలు కూడా ఎక్సైజ్ సిబ్బందికి సహకరించి, నాటుసారా నిర్మూలనకు సహకరించాలని కలెక్టర్ కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, జిల్లాలో నాటుసారా నిర్మూలన చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సీఐ, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

బడా స్మారక స్తూపం ఆవిష్కరణ

కదిరి అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన సీపీఎం సీనియర్ నాయకులు బడా సుబ్బిరెడ్డి స్వగ్రామమైన వరిగిరెడ్డిపల్లి గ్రామంలో స్మారక స్తూపం బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు రాంభూపాల్, నాయకులు ఓబులు మాట్లాడారు. 30 సంవత్సరాలుగా రైతు, ప్రజా ఉద్యమాల్లో సుబ్బిరెడ్డి చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఎన్పీకుంట సోలార్ ప్రాజెక్టులో భూములో కోల్పోయిన రైతులకు పరిహారం, పునరావాసం కోసం, పార్టీ నిర్వహించిన పోరాటంలో సుబ్బిరెడ్డి ముందు వరుసలో నిలిచాడన్నారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ నరసింహులు, అన్నదాత రామిరెడ్డి, రామకృష్ణ, సీపీఎం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, జీఎల్ నరసింహులు, హరి, కదిరప్ప, ప్రవీణ్‌కుమార్, ఐద్వా మహిళ సంఘం నాయకురాలు శాంతిబాయి, మున్నీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు మాబూన్నీషా, సుశీల, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్తూపం వద్ద సుబ్బిరెడ్డికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మహిళలకు వ్యక్తిగత స్వేచ్ఛ ఉండాలి: ఎస్పీ





ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, మాట్లాడుతున్న ఎస్పీ రత్న

కదిరి, మార్చి5(ఆంధ్రజ్యోతి): మహిళలకు వ్యక్తిగత స్వేచ్ఛ ఉండాలని ఎస్పీ రత్న పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి బాలికల ఉన్నత పాఠశాల వరకు మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ర్యాలీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. మహిళల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మహిళలు అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళల హక్కులకు భంగం కలిగితే చట్టాల ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, పట్టణ సీఐ నారాయణరెడ్డి, అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐలు, మహిళాసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బాబా జయంతికి ప్రత్యేక నిధులివ్వండి


మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి వినతి

పుట్టపర్తిరూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంత్యుత్సవాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఐటీ, మానవ వనరులశాఖామంత్రి నారా లోకేశ్‌కు విన్నవించారు. ఆమె రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణితో కలిసి మంత్రి లోకేశ్‌ను బుధవారం అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా ఆమె సత్యసాయిబాబా జయంతిని మానవ వనరుల అభివృద్ధి దినోత్సవంగా ప్రకటించాలని కోరారు. పుట్టపర్తి ఎయిర్‌పోర్టును అన్ని వసతులతో అభివృద్ధి చేయాలన్నారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాదు, విజయవాడ నగరాలకు విమానసర్వీసులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం నిధుల లేమితో నిలిచిపోయిందని, నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలియజేశారు.



మంత్రి లోకేశ్‌కు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే

ఉష్ణోగ్రతలు



బుధవారం

గరిష్ఠం	36.0
కనిష్ఠం	23.0



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.32 గురువారం సాయంత్రం	5.10 శుక్రవారం ఉదయం
కదిరి	6.29 గురువారం సాయంత్రం	5.14 శుక్రవారం ఉదయం
ధర్మవరం	6.32 గురువారం సాయంత్రం	5.10 శుక్రవారం ఉదయం
హిందూపురం	6.32 గురువారం సాయంత్రం	5.18 శుక్రవారం ఉదయం
పెనుకొండ	6.32 గురువారం సాయంత్రం	5.18 శుక్రవారం ఉదయం



మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అని రాసిన వైట్‌బోర్డు వాహనం

ఇంజనీర్ల కక్కుర్తి

హెచ్చెల్సీ డివిజన్‌లో ఉంచిన అద్దె కార్లు



జలవనరుల శాఖలో అద్దె వాహనాల గోల్‌మాల్

నిబంధనలకు విరుద్ధంగా వైట్ బోర్డు వాహనాల వినియోగం

బిల్లు మాత్రం ఎల్లోబోర్డు వాహనాల పేరిట డ్రా

ఏటా రూ.కోట్ల నిధులు స్వాహా

బదిలీపై వెళ్లిన ఈఈపై విచారణ


మైనర్ ఇరిగేషన్ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో అద్దె వాహనాల పేరుతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం, హెచ్చెల్సీ, మైనర్ ఇరిగేషన్‌లో ఇదే తంతు సాగుతోంది. ఏకంగా ఓ ఇంజనీరు నాలుగు పోస్టుల్లో పనిచేస్తూ రెండు వాహనాలకు బిల్లులు డ్రా చేసుకుంటున్నారు. మరో ఇంజనీరు గతంలో హెచ్చెల్సీలో పని చేసి సుమారు రూ.3లక్షలు అద్దె వాహనాల పేరుతో డ్రా చేయడంపై నేటికీ విచారణ సాగుతోంది. తాజాగా ఆ ఇంజనీరు నంద్యాల నుంచి జిల్లాకు వచ్చి జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ వద్ద విచారణకు హాజరైనట్లు సమాచారం. హంద్రీనీవాలో ఇన్‌చార్జి ఈఈలుగా ఉన్న డీఈలు ఇదే తరహాలో అద్దె వాహనాల పేరుతో బిల్లులు చేసుకుంటున్నారనే చర్చ ఆ శాఖలో జోరుగా సాగుతోంది. హెచ్చెల్సీలో ఓ డివిజన్‌కు ఇన్‌చార్జి ఈఈగా పనిచేస్తున్న డీఈ ఆ డివిజన్ వైపు నెలకు ఒక్కసారైనా తొంగి చూడకపోవడం అటుంచితే... ప్రతినెలా వెహికల్ అద్దె బిల్లులు మాత్రం సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం నిరుద్యోగిగా ఉండే ఒక ఎల్లోబోర్డు వాహనం కలిగిన డ్రైవర్‌కు ఉపాధి కల్పించేలా అద్దె వాహనాలను తీసుకోవాలి. జలవనరుల శాఖలో ఇందుకు విరుద్ధంగా ఇంజనీర్లు సొంత వైట్‌బోర్డు కలిగిన వాహనాల్లో తిరుగుతూ అద్దె కోసం బినామీ ఎల్లో బోర్డు వాహనాలను నమోదు చేస్తున్నారు. ఇక మైనర్ ఇరిగేషన్ లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జలవనరుల శాఖలో ఏటా అద్దె వాహనాల పేరుతో రూ.కోట్లాది నిధులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి.

ఆయన రూటే వేరు...

జలవనరుల శాఖలో ఆయన రూటే వేరుగా నడుస్తోంది. ఆరోగ్య సమస్యల పేరుతో ఆఫీస్ నుంచి బయటకు కదలరు...వాహనం తీయరు... బిల్లు మాత్రం ప్రతి నెలా ఎంచక్కా డ్రా చేసుకుంటారు. ఒకటి కాదు... రెండు కాదు ఏకంగా ఐదు పోస్టులలో ఆ ఇంజనీరు పనిచేస్తున్నారు. రెండు పోస్టులకు సంబంధించి వెహికల్ బిల్లు డ్రా చేస్తున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో డిప్యూటీ సీఈగా, హెచ్చెల్సీ ఐ డివిజన్ ఈఈగా, హెచ్చెల్సీ డిప్యూటీ ఎస్‌ఈగా, డీబీసీ డివిజన్ ఈఈగా పనిచేస్తున్నారు. ఇందులో ఐ డివిజన్, డీబీసీ డివిజన్లకు సంబంధించి ప్రతినెలా అద్దె వాహనాలకు సంబంధించి బిల్లులు చేసుకుంటున్నారు. బిల్లులు పెట్టకపోతే 'మీ కథ చూస్తానంటూ...' కిందిస్థాయి ఉద్యోగులపై చిందులేస్తున్నట్లు సమాచారం. తనకు ఆరోగ్యం సరిగా లేదనే సాకుతో ఉద్యోగులపై పెత్తనం చేస్తూ బిల్లులు స్వాహా చేస్తున్నారు.



బదిలీపై వెళ్లిన ఇంజనీరుపై విచారణ

హెచ్చెల్సీ పరిధిలోని ధర్మవరం డివిజన్ బ్రాంచ్ కెనాల్ ఈఈగా పనిచేసిన అధికారిపై వాహనాల బోగస్ బిల్లులు డ్రా చేసిన ఆరోపణలపై విచారణ సాగుతోంది. 2020, 2021 సంవత్సరాల్లో డీబీసీ డివిజన్‌లో ఈఈగా పనిచేసిన శుభకుమార్ నంద్యాలకు బదిలీలపై వెళ్లారు. ఆయన పనిచేసిన సమయంలో సుమారు రూ.3లక్షలు అద్దె వాహనంలో తప్పుడు బిల్లులతో నిధులు డ్రా చేసుకున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో... అప్పటి నుంచి విచారణ సాగుతోంది. తాజాగా జలవనరుల శాఖ ప్రాజెక్ట్ సీఈ వద్దకు వచ్చి శుభకుమార్ విచారణకు హాజరైనట్లు సమాచారం. ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈఈ శుభకుమార్ అనేక ప్రయత్నాలతో పాటు గతంలో ఉన్నత స్థానాల్లో పనిచేసిన అధికారుల నుంచి ఒత్తిడి చేయిస్తున్నట్లు తెలిసింది. ఆ కేసు నుంచి ఈఈ శుభకుమార్‌కు విముక్తి కల్పించేందుకు విచారణ చేస్తున్న అధికారులు ఏమాత్రం అంగీకరించడం లేదనేది ఆ శాఖలో చర్చ సాగుతోంది.

20మందికిపైగా వాహన సదుపాయం

జలవనరుల శాఖలో కీలకంగా హెచ్చెల్సీ ఎస్‌ఈ, డిప్యూటీ ఎస్‌ఈ, ఈఈలు, డీఈలు, ఏఈలు ఉన్నారు. వీరిలో ఎస్‌ఈ, ఈఈలు, డీఈలకు వాహన సదుపాయం ఉంది. సొంత వాహనాలు వాడరాదనీ, పైగా బినామీ, కుటుంబ సభ్యుల పేరుతో కూడా ఉండరాదనీ, నిరుద్యోగులైన డ్రైవర్లకు అద్దె వాహనం పెట్టుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వం ప్రత్యేకంగా నిబంధన విధించింది. నిబంధనలకు తూట్లు పొడుస్తూ హెచ్చెల్సీ పరిధిలోని ఓ డీఈ... అదే శాఖలోని ఓ డివిజన్‌కు ఇన్‌చార్జి ఈఈగా పనిచేస్తూ క్షేత్రస్థాయిలోకి వెళ్లకుండానే వెళ్లినట్లు వాహనాలకు బిల్లులు చేసుకుని స్వాహా చేస్తున్నారు. ఇన్‌చార్జి ఈఈగా ఉన్నా.. డివిజన్‌కు నెలలో ఒక్కసారి కూడా వెళ్లిన పాపాన పోలేదు. బిల్లులు మాత్రం ప్రతినెలా క్షేత్రస్థాయిలోకి వెళ్లినట్లు డ్రా చేసుకుని తన ఖాతాలోకి వేసుకుంటున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. అయినా ఆ ఇంజనీరు ఏమాత్రం లెక్కచేయకుండా అద్దె వాహనాల పేరుతో బిల్లులు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోనే ఉంటున్న డీఈలు ఏసీ ఆఫీస్‌లో కూర్చుని అద్దె వెహికల్‌కు బిల్లులు చేసుకుంటున్నారు.

హంద్రీనీవాలోనూ అదే తంతు

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం జలవనరుల శాఖలో మరో కీలకమైన విభాగం. ఇందులో కూడా ఐదు డివిజన్లు ఉన్నాయి. వాటికి ఐదుగురు ఈఈలు, ఒక్కో డివిజన్‌లో సుమారు నలుగురు డీఈల చొప్పున 20మందికి పైగా ఉన్నారు. వీరిలో సగానికి పైగా ఇంజనీర్లు సొంత వాహనాల్లో వైట్‌బోర్డుతో తిరుగుతూ అద్దె కోసం ఎల్లో బోర్డు వెహికల్ నంబరు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఐదు డివిజన్లలో నాలుగు డివిజన్లకు ఇన్‌చార్జి ఈఈలే ఉన్నారు. హంద్రీనీవాలో ఇన్‌చార్జి ఈఈలుగా ఉన్న డీఈలు రెండేసి వాహనాలకు ఒక వైట్, ఒకటి ఎల్లో బోర్డుతో బిల్లులు డ్రా చేసుకుంటున్నారు. ఇక్కడ అడిగే నాథుడే కరువయ్యాడు.


జల వనరుల శాఖ కార్యాలయం

మైనర్ ఇరిగేషన్‌లో వైట్‌బోర్డు వెహికల్

మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉమ్మడి జిల్లాలో ముగ్గురు ఈఈలు, 12 మంది డీఈలు ఉన్నారు. ఈఈ పోస్టుల్లో ఇన్‌చార్జిలుగా డీఈలు పనిచేస్తున్నారు. ధర్మవరం డివిజన్‌లోని ఓ డీఈ ఏకంగా సొంత వాహనం వైట్‌బోర్డుతో గవర్నమెంట్ ఆన్ డ్యూటీ పేరుతో తిరుగుతూ అద్దె కోసం బినామీ పేరుతో బిల్లు డ్రా చేస్తున్నారు. ఇలా మైనర్ ఇరిగేషన్‌లో ఈఈలు, డీఈలు అద్దె వాహనాల పేరుతో సొంత వాహనాలకు నిధులు డ్రా చేసుకుంటూ స్వాహా చేస్తున్నారు.


హెచ్చెల్సీ కార్యాలయం

మా దృష్టికొచ్చింది

కొంతమంది ఇంజనీర్లు అద్దె వాహనాలకు తిరగకనే బిల్లులు చేసుకుంటున్నట్లు సమాచారం ఉంది. అటువంటి బిల్లులను నిలుపుదల చేయాలని అధికారులకు సూచించాం. డీఈ, ఈఈలకు వాహన సదుపాయం ఉంది. కచ్చితంగా ఎల్లో బోర్డు ఉండి అద్దె వాహనాలకు మాత్రమే బిల్లులు చెల్లించాలి. వైట్‌బోర్డుతో తిరిగి బిల్లులు చేసుకుంటే కచ్చితంగా విచారణ చేసి, వెనక్కు కట్టిస్తాం. ఇందులో ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదు.

- నాగరాజ, జలవనరుల శాఖ జిల్లా ప్రాజెక్టుల సీఈ

16 ఏళ్లుగా పరిహారం కోసం ఎదురుచూపు

పునరావాసం కల్పించాలంటున్న గ్రామస్థులు

ఎన్నికల హామీతో సరిపెడుతున్న పార్టీలు

ఇదీ ఉల్లికల్లు గ్రామస్థుల కన్నీటి వ్యథ

ఎన్నాళ్లకు ఇస్తారో..?

చాగల్లు ప్రాజెక్టులో ముంపునకు గురైన ఉల్లికల్లు ముఖచిత్రం



ఆ ఊరు ద్వీపంగా మారటానికి, ఆ గ్రామ దీపం ఆరిపోవటానికి ఎంతో సమయం లేదు. ఇప్పటికే మూడు వైపులా నీరు చేరింది. ఆపన్న హస్తం అందక, ప్రభుత దయలేక ఉబికి వచ్చే కన్నీటిని రెప్పలమాటున దాచుకుంటూ వీధులను ముంచుతున్న నీటిలోనే గ్రామస్థులు జీవనం సాగిస్తున్నారు. పదిమంది బాగుకోసం కన్నతల్లిలాంటి పుట్టి పెరిగిన ఊరిని, జీవనాన్ని త్యాగం చేస్తే ఆర్ద్రతతో అక్కున చేర్చుకోవాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా పూర్తిస్థాయిలో పరిహారం అందడం లేదు. ఉన్నఊరిని వదలేక, వేరే చోట బతకలేక ముంచుతున్న నీటిలోంచి వచ్చే పురుగు పుట్రలతోనే ఆ గ్రామ ప్రజలు సహజీవనం చేస్తున్నారు. ఇన్ని కష్టాల నడుమ కొట్టుమిట్టాడుతున్న ఆ గ్రామమే శింగనమల మండలంలోని ఉల్లికల్లు.

ఉల్లికల్లు గ్రామంలోకి చేరుతున్న నీరు



శింగనమల మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు కోసం పొలాలు, ఇళ్లను తాగ్యం చేసిన వారిని ఆదుకునే విషయంలో అధికారులు ప్రజా ప్రతినిధులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ముంపు ముంగిట ఉన్నవారి కన్నీళ్లు తుడిచేందుకు నింబంధనలు అడ్డు వస్తున్నాయని చెబుతూ 16 ఏళ్లు గడిపేశారు. ప్రతి 5 ఏళ్లకు ప్రజాప్రతినిధులు మారుతున్నారే తప్ప తమ బతుకుల్లో మార్పు రావడంలేదని చాగల్లు రిజర్వాయర్ ముంపు గ్రామం ఉల్లికల్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపప్పూరు మండలం చాగల్లు వద్ద 2009లో ప్రాజెక్టు నిర్మించారు. శింగనమల మండలంలోని ఉల్లికల్లు గ్రామ ముంపునకు గురి అవుతుందని నివేదికలో పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సమీపంలో ఉండటంతో ఊట కారణంగా గ్రామం నివాస యోగ్యం కాదని తేల్చారు. అక్కడి భూములు వ్యవసాయానికి పనికిరావని గుర్తించారు. అయితే ఇప్పటి వరకు ఏ ఒక్కరికి పరిహారం అందించలేదు. పునరావాసం కల్పించలేదు.

నిబంధనల పేరిట జాప్యం

చాగల్లు ప్రాజెక్టును 1.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. పూర్తి నిల్వ సామర్థ్యం (ఎఫ్‌ఆర్‌ఎల్) ఉన్న సమయంలో ఉల్లికల్లులో 66 ఇళ్లు ముంపులోకి వెళ్లిపోతాయని నివేదికలు చెబుతున్నాయి. పూర్తి నిల్వ సామర్థ్యంపైన 100 మీటర్ల వరకు 218 నివాసాలను గుర్తించారు. నింబంధనల మేరకు అంతవరకు మాత్రమే పరిహారం అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఎఫ్‌ఆర్‌ఎల్ 100 మీటర్ల కంటే పైన ఉన్న 560 ఇళ్లకు సైతం పరిహారం ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నా రు. ఊర్లో సగం ఖాళీ అయితే మిగతావారంతా ఎలా ఉండాలంటూ డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు. పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఆగిన ప్రక్రియ

గ్రామంలోని ఇళ్లు, ఇతర నిర్మాణాలు, భూమికి వన్‌టైం సెటిమెంట్ కింద పరిహారం చెల్లించాలని గత ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇళ్లకు రూ.84 కోట్లు, ఇతర నిర్మాణాలకు రూ.66 కోట్లు, భూమికి రూ.70 లక్షలు చెప్పున మెత్తం రూ.151 కోట్లు అవసరమని నివేదికలో పేర్కొన్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రక్రియ నిలిచిపోయింది.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత సెప్టెంబరులో శింగనమల తహసీల్దార్ ఉల్లికల్లు పరిహారంపై జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు.

ఎన్నికల్లో హామీ

ఏ ఎన్నికలు వచ్చిన ఉల్లికల్లు పరిహారమే ముఖ్య అజెండాగా ఉంటోంది. తమ పార్టీ గెలిస్తే పరిహారం అందజేస్తామని ఎమ్మెల్యేలుగా గెలిచిన డాక్టర్ సాకే శైలజనాథ్, యామినిబాల, జొన్నలగడ్డ పద్మావతి వరకు ప్రకటించారు. తర్వాత నయాపైస ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రస్తుత ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పరిహారం తీసుకుని వస్తారని గ్రామస్థులు నమ్మకంతో ఉన్నారు.

ఊట నీటిలోనే నివాసం



చాగల్లు ప్రాజెక్టు నీరు మాగ్రామంలోకి చేరడంతో ఊట పెరిగింది. దీంతో ఇళ్లను మూడు అడుగులపైగా ఎత్తు చేశాం. 18 ఏళ్ల నుంచి పరిహారం కోసం ఎదురుచూస్తున్నాం. అయిన ఇంత వరకు నయా పైస రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిహారం వచ్చేలా చూడాలి. ప్రస్తుతం ఊట నీటిలోనే ఇబ్బందులు పడుతున్నాం.

-రాజాక్



ప్రభుత్వం స్పందించాలి

భారీ వర్షాలు వస్తే గ్రామంలోకి నీరు వస్తాయి. అధికారులు వచ్చి చూసి వెళ్లన్నారే తప్ప న్యాయం చేయడం లేదు. పొలాలు ముంపునకు గురి అవుతుండటంతో స్థానికంగా ఉపాధి తగిపోతోంది. ఉన్న భూములు ముంపులోకి వెళ్లిపోవడంతో పక్క గ్రామల్లో కూలి పనులకు వెళ్తున్నాం.



-లక్ష్మీనారాయణమ్మ

అభివృద్ధికి దూరం..



ముంపు గ్రామం కింద ఉండడంతో గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు రావడంలేదు. గ్రామంలో మౌలిక సదుపాయలకు ఉన్న పంచాయతీ నిధులు వాడుతున్నాం గ్రామానికి రావడానికి కనీసం సరైన రోడ్డు లేదు. ప్రభుత్వం పరిహారం ఇస్తే...మరో చోట నిర్మాణాలు చేపడతాం.

- సర్పంచ్ అనసూయమ్మ


ఉల్లికల్లు గ్రామంలో రోడ్డు దుస్థితి

న్యాయం చేస్తాం

ఉల్లికల్లు గ్రామానికి ఏళ్లుగా పరిహారం రాకపోవడం సమస్యగా ఉంది. పరిహారం సమస్యను సీఎం దృష్టికి తీసుకుని వెళ్లి బాధితులకు నాయ్యం చేస్తాం. కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులపై శ్రద్ధ చూపుతుండటంతో ఉల్లికల్లు బాధితులకు న్యాయం జరుగుతుందని నాకు నమ్మకం ఉంది.



-బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్యే

పంటలే పండటం లేదు: సూర్యనారాయణ



ప్రాజెక్టు దగ్గరగా ఉండటంతో ఏ పంట సాగు చేసినా భూమి జౌకులు పారుతుండటంతో దిగుబడులు రాలేదు. అయితే పరిహారం ఈ ఏడాది, వచ్చే ఏడాది వస్తుందని ఆశతో ఎదురు చూస్తూనే ఉన్నాం. పరిహారం అందక, పంటలు పండక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

అనధికార చిట్టీల నిర్వాహకుల మోసాలు

ఛీట్టీలు!

చిట్టీల సొమ్ము, భారీగా రుణాలు తీసుకుని ఉడాయిస్తున్న వైనం

లబోదిబోమంటున్న బాధితులు

పోలీసులను ఆశ్రయిస్తున్నా.. జరగని న్యాయం


పోలీసు స్టేషన్ వద్ద బాలకృష్ణ బాధితులు

గుత్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): డబ్బు దర్పా చూపుతారు. విలాస జీవితం గడుపుతున్నట్లు నటిస్తారు. తమకేమీ తక్కువ లేదన్నట్లు అందరినీ నమ్మిస్తారు. చిట్టీలు నిర్వహిస్తున్నామంటున్నారు. చిట్టీ వేసుకుంటే డబ్బు పొదుపు అవుతుందని నమ్మ బలుకుతారు. చిట్టీలు కట్టించుకుంటారు. డబ్బు కూడా వెంటనే ఇస్తారు. అలా.. చిట్టీలను పెంచుకుంటూ పోతారు. పూర్తిగా నమ్మిన చిట్టీలు వేసుకున్న వారిని అప్పులు అడుగుతారు. డబ్బు ఇచ్చాక కొన్ని నెలలపాటు వడ్డీలు ఠంచనుగా చెల్లిస్తారు. దీంతో పూర్తిగా నమ్మిపోయిన రుణదాతలు అడిగినపుడల్లా అప్పు ఇచ్చుకుంటూ పోతారు. ఇలా ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద రుణాలు తీసుకుంటారు. చిట్టీల వేసిన సొమ్ముతోపాటు పెద్దఎత్తున తీసుకున్న రుణాలతో గుట్టుచప్పుడు కాకుండా నిర్వాహకులు ఉడాయిస్తారు. దీంతో బాధితులు షాక్‌కు లోనవుతున్నారు. చిట్టీలు వేసుకున్న డబ్బు, అప్పు ఇచ్చిన సొమ్ము సర్వం కోల్పోతున్నారు. ఇల్లు కట్టుకునేందుకనో, పిల్లల చదువులకనో, పెళ్లిళ్లకనో దాచుకున్న సొమ్మంతా పోగొట్టుకుని దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. న్యాయం చేయమని పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఆధారాలు చూపాలని పోలీసులు అడుగుతుండడంతో దిక్కులు చూస్తున్నారు. ఇలా అనధికార చిట్టీల నిర్వాహకుల బారిన పడి చాలామంది సర్వం కోల్పోతున్నారు. గుత్తిలో ఇలాంటి చిట్టీ మోసాలు వరుసగా వెలుగు చూస్తున్నాయి.

గుత్తి రైల్వేస్‌లో రైల్వే రిటైర్డ్ ఉద్యోగి అత్తర్ సాహెబ్ చిట్టీల పేరుతో రూ.కోట్లలో వసూలు చేశాడు. గతేడాది జూలై 10న ఏకంగా రూ.3కోట్లతో కుటుంబ సమేతంగా ఇంటికి తాళాలు వేసి ఉడాయించాడు.

సూరసింగనపల్లికి చెందిన మహిళ చీరల వ్యాపారం చేస్తూ కాలనీలో లక్షల్లో చిట్టీలు నిర్వహించారు. ఒకరికి తెలియకుండా మరొకరితో వడ్డీ ఆశ చూపి లక్షలాది రూపాయలు అప్పుగా తీసుకున్నారు. గతేడాది నవంబరు 23న ఇంటికి తాళాలు వేసి, దేవాలయాలకు వెళ్తున్నామని చెప్పి మాయమైపోయారు. ఆ తరువాత ఐపీ నోటీసు పంపడంతో బాధితులు ఖంగుతిన్నారు. పోలీసులను ఆశ్రయించారు.

గతేడాది అక్టోబరులో పట్టణంలో వంకదారు బాలకృష్ణ వ్యాపారం చేస్తూ అందరితో కలిసి మెలిసి ఉండేవాడు. మార్కెట్‌లోని వ్యాపారులతో పరిచయాలు పెంచుకున్నాడు. చిట్టీలు వేశాడు. ఒక్కసారిగా కుటుంబసమేతంగా రూ.4కోట్లతో ఉడాయించాడని బాధితులు.. పోలీసులను ఆశ్రయించారు.

చిట్టీలు వేసి మోసపోయా: ఉమాదేవి, సూరసింగనపల్లి



మా వీధిలో ఉండే మహిళ వద్ద రూ.5లక్షల చిట్టీ వేశా. నా భర్త.. స్నేహితుల వద్ద రూ.10లక్షలు ఆమెకు అప్పు ఇప్పించారు. ఆమె ఫేక్ ప్రాంసరీ నోట్లు ఇచ్చి, మోసం చేసింది. దీంతో ఇతరులకు మేము వడ్డీ కట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ డబ్బుకు ఆమె ఐపీ నోటీసు పంపారు.

ఆశచూపి మోసం చేశారు: ధనలక్ష్మి, గుత్తి ఆర్‌ఎస్



చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్నా. గుత్తి ఆర్‌ఎస్‌లో అత్తర్ సాహెబ్ వద్ద రూ.3 లక్షలు చిట్టీ వేసి, మోసపోయా. పోలీసులు న్యాయం చేయాలి.

పోలీసులను ఆశ్రయించినా న్యాయం చేయలేదు: అరీఫా, గుత్తి



పట్టణంలోని కురుంగేరిలో చిట్టీల నిర్వాహకుడు ఐదు నెలల క్రితం మృతి చెందాడు. ఆయన వద్ద రూ.5లక్షలు చిట్టీలను నాతో పాటు నా కుటుంబ సభ్యులు ముగ్గురు వేశాం. ఆయన మృతితో కుటుంబసభ్యులు డబ్బు చెల్లించేది లేదన్నారు. పోలీసులను ఆశ్రయిస్తే ఆధారాలు కావాలన్నారు. దీంతో రూ.15లక్షలు నష్టపోయాం.

అనధికార చిట్టీలు నిర్వహిస్తే కఠిన చర్యలు: వెంకటేశ్వర్లు, సీఐ

చిట్టీల పేరుతో వ్యాపారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. అనుమతులు లేకుండా చిట్టీలు నిర్వహిస్తే చర్యలు తప్పవు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కల్తీలపై కఠిన చర్యలు

ఆహార భద్రతాధికారి తస్లీం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల్లో కల్తీ చేసినా, అపరిశుభ్రత కనిపించినా, నాణ్యత లోపించినా శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు ఆహార భద్రతాధికారి తస్లీం. ఇందులో ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదంటున్న ఆమెతో ప్రత్యేక ఇంటర్వ్యూ...

ప్రశ్న: జిల్లాలో తనిఖీలు ఎలా సాగుతున్నాయి..?

జవాబు: రోజూ జిల్లాలో ఏదో ఒక ప్రాంతాన్ని ఎంచుకుని, తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించని ఆయా రెస్టారెంట్లు, హోటల్ సముదాయాలకు అక్కడికక్కడే నోటీసులు జారీ చేస్తున్నాం. సమస్య తీవ్రంగా ఉంటే శాంపిళ్లు సేకరించి, ల్యాబ్‌కు పంపుతున్నాం.

ప్రశ్న: హోటళ్ల ఏర్పాటు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారా..?

జవాబు: హోటల్, రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవాలనుకుంటే తప్పనిసరిగా ఫారం-బితో లైసెన్సులు పొందాలి. ఇదే విషయాన్ని ప్రతి తనిఖీలో సూచిస్తున్నాం. చాలావాటికి లైసెన్సులు లేవు. లైసెన్సుతో పాటు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి. అలాంటి వారు మాత్రమే హోటల్, రెస్టారెంట్ నిర్వహించాల్సి ఉంటుంది.

ప్రశ్న: హోటళ్లు, రెస్టారెంట్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారా..?

జవాబు: నెలరోజుల క్రితం అపరిశుభ్రత, కల్తీలు, నాణ్యత ప్రమాణాలు పాటించని 11 హోటల్ సముదాయాలపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం. అన్నింటికీ హెచ్చరికలు జారీ చేశాం.

ప్రశ్న: సీజింగ్, ఫైన్ అథారిటీపై ఏవైనా ఆదేశాలు అందాయా..?

జవాబు: ఆహార భద్రత శాఖకు కేవలం నోటీసులు, హెచ్చరికలు, శాంపిళ్ల సేకరణకు మాత్రమే అనుమతులున్నాయి. కొంతమంది నిర్వాహకులకు ఎన్నిసార్లు చెప్పినా మార్పు కనిపించడం లేదు. సీజింగ్, ఫైన్ అథారిటీ అప్రూవల్‌పై ఉన్నతాధికారులకు విన్నవించాం. ఆదేశాలు అందితే మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: గుత్తిలోని ఓ ధాబాలో ఘటనపై చర్యలు తీసుకున్నారా..?

జవాబు: గత సంవత్సరంలో ఆ ధాబాలో జరుగుతున్న కల్తీలు, అపరిశుభ్రతపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా... దానిని మాకు బదిలీ చేశారు. అందులో భాగంగా ధాబాలో తనిఖీకి వెళ్లా. లైసెన్సు, రిజిస్ట్రేషన్ లేకపోవడాన్ని గుర్తించా. అపరిశుభ్రత, తినుబండారాల్లో నాణ్యతాలోపం కొట్టిచ్చినట్లు కనిపించడంతో జిల్లా కలెక్టర్‌కు ఫైల్ పంపా. అనంతరం సీజ్ చేశారు.

ప్రశ్న: కల్తీరాయుళ్లకు ఏం చెప్పదలచుకున్నారు..?

జవాబు: ప్రజలకందించే ఆహార పదార్థాల్లో కల్తీ చేసినా, అపరిశుభ్రత కనిపించినా, నాణ్యత లోపించినా శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవు. ఇప్పటికే పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. మార్పు రాకపోతే జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నా.

సూక్ష్మపోషకాల లోపాలను నివారించండి

డివిజనల్ ఉద్యాన శాఖాధికారి ప్రతాప్‌రెడ్డి

నంబులపూలకుంట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కర్బుజా, దోస పంటల్లో సూక్ష్మ పోషకాల లోపాలను నివారించుకోవాలని కదిరి డివిజనల్ ఉద్యాన శాఖాధికారి ప్రతాప్‌రెడ్డి.. రైతులకు సూచించారు. మండలంలోని గౌనపల్లి, మరికొమ్మదిన్నె గ్రామాల పరిధిలో బుధవారం వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. కర్బుజా, దోస పంటలను ఉద్యాన శాకాధికారి ప్రతాప్ రెడ్డి పరిశీలించి, రైతులకు సూచనలు ఇచ్చారు. సూక్ష్మపోషకాల లోపాలు నివారించడానికి ఫార్ములా-4 ఐదు గ్రా., బోరాన్ 2 గ్రా., లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పంట సాగుకు ముందు పశువుల ఎరువు, జీలుగ, జనుము, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట ఎరువులు వేసి భూమిని దున్నితే తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. మామిడి చెట్లను పరిశీలించి, నీటితడులు ఇవ్వాలనీ, పూత రాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

స్కిల్ హబ్ ఏర్పాటు

ధర్మవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్‌హబ్‌ను ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల పదో తేదీ నుంచి ఇంజనీరింగ్ టెక్నికల్ సపోర్టు కోర్సును ప్రారంభిస్తామన్నారు. ఇంటర్‌పాస్, డిగ్రీ, పీజీ చేసి ఆసక్తి కలిగిన యువతీ యువకులు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9182288465 నెంబర్‌కు లేదా ప్రభుత్వపాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా సంప్రదించవచ్చన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తామని వెల్లడించారు.

ఆగ్రోస్ మేనేజర్ల నియామకం

అనంతపురం అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఆగ్రోస్ మేనేజర్లను నియమించారు. అనంతపురం ఆగ్రోస్ మేనేజర్‌గా ఓబుళపతి, శ్రీసత్యసాయి జిల్లాకి శ్రీనివాసులును నియమించారు. ప్రస్తుతం అనంతపురం భూసార సంరక్షణా విభాగ ఏడీఏగా ఓబుళపతి, హిందూపురం భూసార సంరక్షణా విభాగ ఏడీఏగా శ్రీనివాసులు పనిచేస్తున్నారు. ఇదివరకు ఉమ్మడి జిల్లాకు ఒకే ఆగ్రోస్ మేనేజర్ ఉండేవారు. తాజాగా వేర్వేరుగా ఇద్దరిని నియమించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆగ్రోస్ ద్వారా యాంత్రీకరణ పరికరాలు సరఫరా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి జిల్లాలకు మేనేజర్లను నియమించారు.

క్షేమంగా ఇంటికి..

అదృశ్యమైన ఇద్దరు మహిళలు, ముగ్గురు పిల్లలను తీసుకొచ్చిన పోలీసులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలో అదృశ్యమైన ఇద్దరు మహిళలు, ముగ్గురు పిల్లలను వన్‌టౌన్ పోలీసులు క్షేమంగా తీసుకొచ్చారు. నగరంలోని భవానీనగర్‌కు చెందిన నాగరత్న భర్త ఏడేళ్ల క్రితం మృతిచెందాడు. వీరికి సువర్ణ, అరుణ, నాగేంద్ర సంతానం. సువర్ణ, అరుణకు పెళ్లి చేశారు. సువర్ణ భర్త ప్రకాష్ తాగుడుకు బానిసై భార్యాపిల్లలను పట్టించుకునేవాడు కాదు. వీరికి కొడుకు, పాప సంతానం. అరుణ.. భర్త హరీష్‌ను వదిలి తల్లి వద్ద ఉంటోంది. ఈమెకు ఒక కుమారుడున్నాడు. ఈ క్రమంలో నాగరత్న ఏదైనా పని చేసి కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండొచ్చుగా అని సువర్ణ, అరుణను దండించింది. తల్లికి భారమవుతున్నామని భావించి.. ఎక్కడికైనా వెళ్లి బతుకుదామని అక్కాచెల్లెళ్లు భావించి గతనెల 6వతేదీన సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా తమ పిల్లలు అభిరామ్, రుషి, పల్లవితో కలిసి ఎక్కడికో వెళ్లిపోయారు. దీనిపై ఫిర్యాదు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కాల్‌డేటా ద్వారా వారి ఆచూకీ కనుగొన్నారు. కర్ణాటక రాష్ట్రం ఉడుపి పట్టణంలోని ఓ గదిలో ఉంటున్న వారిని క్షేమంగా తీసుకొచ్చారు.

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన మాస్టర్ అథ్లెట్లు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాలు దక్కాయి. బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో బుధవారం 45వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 నిర్వహించారు. దేశవ్యాప్తంగా 30 నుంచి 100 ఏళ్లలోపు వయసున్న అథ్లెట్లు పాల్గొన్నారు. వాకింగ్, 300, 400 మీటర్ల పరుగు, 3కే రన్, 5కే వాక్, జావెలిన్ త్రో, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీలు నిర్వహించారు. ఏపీ తరఫున జిల్లా నుంచి 35 మంది అథ్లెట్లు ప్రాతినిధ్యం వహించారు. మూడు చొప్పున బంగారు, రజత, ఐదు కాంస్య పతకాలు సాధించారు. విజేతలను ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఉపాధ్యక్షుడు సుధాకర్ బాబు అభినందించారు.

8న హంద్రీనీవాకు నీటి సరఫరా బంద్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు కృష్ణా జలాల సరఫరా ఈనెల 8న బంద్ కానుంది. గతేడాది ఆగస్టు 1న శ్రీశైలం డ్యాం నుంచి మల్యాల వద్ద హంద్రీనీవాకు 675క్యూసెక్కులతో వదిలారు. ఇప్పటి వరకు హంద్రీనీవా ద్వారా ఉమ్మడి జిల్లాకు 25టీఎంసీలు చేరాయి. ఉమ్మడి జిల్లాలో 89 చెరువులను కృష్ణా జలాలతో నింపారు. ఇందులో జీడిపల్లి నుంచి పీఏబీఆర్‌కు 2టీఎంసీల నీరు మళ్లించారు. ప్రస్తుతం 383 క్యూసెక్కులు మాత్రమే మల్యాల నుంచి హంద్రీనీవాకు సరఫరా చేస్తున్నారు. శనివారంతో పూర్తిగా నీటి పంపిణీ నిలిపివేయనున్నారు. హంద్రీనీవా కింద జీడిపల్లి 1.68టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 1.616టీఎంసీల నీరు నిల్వఉంది. గొల్లపల్లి 1.913టీఎంసీలు కెపాసిటీ కాగా ప్రస్తుతం 1.645టీఎంసీలు, మారాల 0.483టీఎంసీలు సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 0.305టీఎంసీలు, చెర్లోపల్లి 1.608టీఎంసీలు సామర్థ్యం కాగా ప్రస్తుతం 1.471టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఫేజ్-1లో 88కిలోమీటర్ల మేర కాలులవ వెడల్పు పనులు, 214కిలో మీటర్ల నుంచి 400కిలోమీటర్ల వరకు కాలవ సిమెంట్ కాంక్రీట్ పనులు ప్రారంభించనున్నారు. దీంతో మల్యాల నుంచి నీటి సరఫరా నిలిపివేసిన తరువాత పనులు ప్రారంభించాలని హంద్రీనీవా పథకం ఇంజనీర్లు ముమ్మర చర్యలు చేపట్టారు. వచ్చే సీజన్‌నాటికి కాలులవ వెడల్పు, లైనింగ్ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు ఇంజనీర్లు చెబుతున్నారు.



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు



మానవత్వంతో సేవ చేయండి

కొత్త వైద్యులకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచన

పండుగ వాతావరణంలో స్నాతకోత్సవం

అనంతపురం టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎంతో గౌరవం ఉన్న వైద్య వృత్తిని చేపట్టడం అదృష్టమని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. మానవత్వంతో ప్రజలకు వైద్యసేవలు అందించాలని నూతన డాక్టర్లకు ఆయన సూచించారు. అనంత వైద్యకళాశాల 2019 బ్యాచ్ విద్యార్థులు కోర్సు పూర్తి చేయడంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో బుధవారం రాత్రి స్నాతకోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై ప్రసంగించారు. ఏ స్థాయికి వెళ్లినా నిస్వార్థంగా, చిత్తశుద్ధితో సేవ చేయాలని అన్నారు. తానూ మొదట వైద్యుడనే అని, ఇప్పటికీ ఆ వృత్తిని తలచుకుంటే ఎంతో ఆనందం కలుగుతుందని అన్నారు. తొలి పోస్టింగ్ ఓ కుగ్రామంలో ఇచ్చారని, అక్కడి ప్రజలకు మంచి సేవలు అందించి, ప్రభుత్వ ఆస్పత్రి గౌరవం పెంచానని అన్నారు. గురువులను, కళాశాలను, తల్లిదండ్రులను ఎప్పటికీ మరవకూడదని అన్నారు. వృత్తిని, కుటుంబాన్ని సమానంగా చూడగలిగేలా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాళ్లు, శంషాద్ బేగం, షారన్ సోనియా, డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ సూపరింటెండెంట్ బెనెడిక్ట్ కోయిలో, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పండుగలా వేడుక

వైద్య కళాశాల స్నాతకోత్సవం పండుగలా సాగింది. సూపర్ స్పెషాలిటీ ఆవేరణలో అందమైన వేదికను ఏర్పాటు చేశారు. కోర్సు పూర్తి చేసిన 150 మందికి కలెక్టర్ పట్టాలను అందజేసి, అభినందించారు. విద్యుద్దీపాల వెలుగుల నడుమ కొత్త డాక్టర్లు సంబరాలు చేసుకున్నారు. పట్టాలను స్వీకరిస్తున్న తమ బిడ్డలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. వేడుకలలో మెడికోల ఆట, పాట అందరినీ అలరించింది. కూచిపూడి, భరతనాట్యంతో సంప్రదాయాన్ని చాటారు.



సెల్ఫీ తీసుకుంటున్న నూతన వైద్యులు



కుటుంబ సభ్యులతో ఆనందం పంచుకుంటున్న నూతన వైద్యుడు



కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ వినోద్‌కుమార్ నుంచి పట్టాలను స్వీకరిస్తున్న నూతన డాక్టర్లు

ఎన్టీఆర్ కలల ప్రాజెక్టులను పూర్తి చేయాలి

అసెంబ్లీలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, మార్చి5(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ ఆశయాలు, కలల ప్రాజెక్టులైన తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు-నగరిలను వేగంగా పూర్తి చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఆమె మాట్లాడుతూ రాయలసీమలో వానలు తక్కువ, నీటి ఎక్కువ అన్నారు. గోదావరి నది నుంచి ప్రతి ఏడాది వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి-బనకచర్ల అనుసంధానం ద్వారా సీమకు నీళ్ల ఇవ్వడానికి కొత్త సాగునీటి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. జిల్లాలోని అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు పూర్తయితే రాప్తాడు నియోజకవర్గంలో సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతిలో భాగంగా రూ.804 కోట్ల వ్యయంతో జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణాజలాలను అప్పర్ పెన్నార్ ప్రాజెక్టుకు తీసుకొచ్చేందుకు గతంలో చంద్రబాబు శిలాఫలకం వేసిన విషయాన్ని గుర్తు చేశారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనుల్లో భాగంగా డిస్ట్రిబ్యూటరీలు ఏర్పాటు చేసి రాప్తాడు నియోజకవర్గంలోని చెరువులకు నీరు వదలడానికి తూములు ఏర్పాటు చేయడంతో పాటు కాలువపై బ్రిడ్జిలు నిర్మించాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని 94 పంచాయతీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రూ.90 కోట్లతో పీఏబీఆర్ రిజర్వాయర్ నుంచి ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు తాగునీరు అందించే పథకం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.



మాట్లాడుతున్న పరిటాల సునీత

భూసేకరణకు కేటాయింపులు పెంచండి

అసెంబ్లీలో ప్రభుత్వ విప్ కాలవ విజ్ఞప్తి

రాయదుర్గం/ అనంతపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో హంద్రీనీవా ప్రాజెక్టుకు కేటాయించిన నిధుల్లో బీటీపీ(భైరవానితిప్ప) భూసేకరణకు నిధులు పెంచాలని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం ఆయన హంద్రీనీవాపై మాట్లాడారు. జీడిపల్లి, బీటీపీ ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యేలా బడ్జెట్‌లో సవరణలు చేయాలని కోరారు. హంద్రీనీవా పనులకు బడ్జెట్‌లో రూ. 2300 కోట్ల కేటాయించడం ద్వారా ప్రాజెక్ట్ భవిష్యత్తుపై ప్రజలకు నమ్మకం కలిగిందన్నారు. ఇందులో భాగంగా జీడీపల్లి, భైరవాన్‌తిప్ప ప్రాజెక్టు భూసేకరణకు రూ. 60కోట్ల కేటాయింపు సరిపోదని అభిప్రాయపడ్డారు. కేటాయింపులు పెంచాలని సంబంధిత మంత్రికి కాలవ విజ్ఞప్తి చేశారు. 2019 ఎన్నికల ముందు హంద్రీనీవా ప్రాజెక్టును మరింత విస్తరిస్తానని హామీ ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రజలను నిలువునా వంచించారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం గంపడు మట్టి కూడా ఎత్తలేదని ధ్వజమెత్తారు. సీమ సాగునీటి రంగానికి వెన్నెముకగా చెప్పుకునే హంద్రీనీవాను త్వరితగతిన పూర్తి చేసి అన్ని చెరువులు నింపాలని కోరారు.



మాట్లాడుతున్న కాలవ

తిరిగిరాని కుంభమేళా రైళ్లు

నెలాఖరుదాకా రద్దు చేసిన అధికారులు

గుంతకల్లు, మార్చి5(ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు రైల్వే డివిజన్ నుంచి వెళ్లిన ప్యాసింజరు రైళ్లను మరో నెల రోజులపాటు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రయాగ్ రాజ్ కుంభమేళాకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం గుంతకల్లు రైల్వే డివిజన్ నుంచి పలు ప్యాసింజరు రైళ్లను రద్దుపరచిన సంగతి విదితమే. జనవరి, ఫిబ్రవరి నెలల్లో తిరుపతి వెళ్లే ప్యాసింజరు, ఫాస్ట్ ప్యాసింజరు రైళ్లను ఫిబ్రవరి ఆఖరు దాకా రద్దుపరిచారు. గత నెల 26న కుంభమేళా ఉత్సవం పూర్తికావడంతో ప్రకటించినట్లుగానే మార్చి 1 నుంచి రద్దయిన రైళ్ల డివిజన్‌కు వస్తాయని అందరూ భావించారు. కుంభమేళాకు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులను స్వస్థలాలకు చేర్చడానికి ప్యాసింజరు రైళ్లను అక్కడకు వినియోగించడం కోసం రద్దును మార్చి ఆఖరు వరకు పొడిగించినట్లు అధికారులు వెల్లడించారు.

రైళ్ల రద్దు పొడిగింపు

ప్రయాగరాజ్ కుంభమేళాకు పంపడం కోసం గుంతకల్లు రైల్వే డివిజన్‌లో రద్దుపరచిన పలు తిరుపతి ప్యాసింజరు రైళ్లను ఈ నెలాఖరుదాకా రద్దును కొనసాగించనున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి-కదిరిదేవరపల్లి (57405), గుంతకల్లు-తిరుపతి (57404), తిరుపతి-హుబ్లీ (57401) ప్యాసింజరును ఈ నెల 8వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు. కదిరిదేవరపల్లి-తిరుపతి (57406), తిరుపతి-గుంతకల్లు (57405), హుబ్లీ-తిరుపతి (57402) ప్యాసింజరు రైళ్లను ఈ నెల 9వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ రద్దు చేసినట్లు తెలియజేశారు. తిరుపతి-కాట్పాడి (67209) ప్యాసింజరును ఈ నెల 8 నుంచి 15వ వరకూ, కాట్పాడి-తిరుపతి (67206, తిరుపతి-కాట్పాడి (67207), తిరుపతి-కాట్పాడి (67208) ప్యాసింజరు రైళ్లను ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ, తిరుపతి-కాట్పాడి (67205), కాట్పాడి-తిరుపతి (67210) రైళ్లను ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకూ రద్దుపరచినట్లు తెలియజేశారు.

297 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు కృష్ణాజలాల 297 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తున్నట్లు బుధవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 314 క్యూసెక్కులు వెళుతున్నాయని పేర్కొన్నారు. రిజర్వాయరులో ప్రస్తుతం 1.578 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

సరిహద్దులో రోడ్డు ప్రమాదం

టాటా ఏస్ వాహనాన్ని ఢీకొన్న వ్యాన్... బాలుడి దుర్మరణం

హిందూపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సరిహద్దులోని ముద్దేపల్లిగేటు వద్ద బుధవారం టాటా ఏస్ వాహనాన్ని వ్యాన్ ఢీకొట్టడంతో హిందూపురానికి చెందిన బాలుడు రేవంత్(12) దుర్మరణం చెందాడు. హిందూపురం పట్టణం సడ్లపల్లిలో నివాసం ఉంటున్న తెలుగుదేశం పార్టీ ఉప్పర సగర పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు వెంకట్ నారాయణ కుమారుడు రేవంత్ బంధువుల ఊరైన కర్ణాటకలోని పెద్దదాళవాటం వెళ్లాడు. బుధవారం మధ్యాహ్నం టాటాఏస్ వాహనంలో రేవంత్ వరుసకు మేనమామ అయిన లక్ష్మీనారాయణతో కలిసి హిందూపురానికి వస్తున్నాడు. ముద్దేపల్లి గేటు వద్దకు రాగానే మధుగిరి వైపు నుంచి హిందూపురం వైపు వస్తున్న వ్యాన్ ఢీకొంది. దీంతో బాలుడి తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. మేనమామ లక్ష్మీనారాయణ కూడా గాయపడ్డాడు. మధుగిరి పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.



రేవంత్ (ఫైల్)

ఇది లైఫ్ టైం సీనియారిటీ లిస్టు

టీచర్లు, హెచ్‌ఎంలకు అత్యంత కీలకమైనది

అభ్యంతరాలుంటే... 10లోపు తెలియజేయండి

కడప ఆర్‌జేడీ శామ్యూల్

అనంతపురం విద్య, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ రూపొందిస్తున్న టీచర్లు, హెచ్‌ఎంల సీనియారిటీ జాబితా అత్యంత కీలకమైందని, లైఫ్‌టైం వంటిదని కడప ఆర్‌జేడీ శామ్యూల్ పేర్కొన్నారు. దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే ఈ నెల పదో తేదీ లోపు తెలియజేయాలని సూచించారు. జిల్లా కేంద్రానికి బుధవారం వచ్చిన ఆయన డీఈఓ కార్యాలయంలో డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ క్రిష్ణయ్యతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీచర్లు, హెచ్‌ఎంల సీనియారిటీ జాబితా తయారు చేయడంపై కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15059 మంది హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, పీఈటీలు ఉన్నారన్నారు. వీళ్లకు సంబంధించిన తాత్కాలిక సీనియారిటీ జాబితా రెడీ చేసి డీఈఓ బ్లాగ్‌లో ఉంచామన్నారు. 1980, 1990 నాటి డీఎస్సీ అపాయింట్‌మెంట్స్ నుంచి కూడా డేటా సేకరించారన్నారు. ఉమ్మడి జిల్లాలోని 15059 మంది టీచర్ల వివరాలు సేకరించి సీనియారిటీ లిస్టు సిద్ధం చేసి క్రమబద్ధీకరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. టీచర్లు నిత్యం సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల మధ్యలో సైన్స్ సెంటర్‌కు వచ్చి అక్కడ ఏర్పాటుచేసిన కౌంటర్లలో అభ్యంతరాలను తెలియజేయాలన్నారు. వచ్చిన ప్రతి అప్పీల్‌ను వెరిఫై చేసి, సవరిస్తామని స్పష్టంచేశారు. నిర్ణీత గడువు వరకూ సెలవు దినాల్లో కూడా అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ వచ్చిన వాటిని పరిశీలించి, సవరించి తుది జాబితాను సిద్ధం చేస్తామన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఫైనల్ సీనియారిటీ లిస్టును ప్రకటిస్తామన్నారు.

నిక్కచ్చిగా రిపోర్టు ఇవ్వాలి

ఇటీవలి కాలంలో విద్యాశాఖలో డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు ఇచ్చే విచారణ రిపోర్టులపై అనేక విమర్శలు వస్తున్నాయంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆర్‌జేడీ శామ్యూల్ స్పందించారు. విచారణ చేసిన తర్వాత సూటిగా, నిక్కచ్చిగా రిపోర్టు ఇవ్వాలని, సలహాలిచ్చేట్టుగా నివేదికలు ఉండకూడదన్నారు. ఎంక్వైరీ రిపోర్టులు పారదర్శకంగా రావాలంటే..విచారణాధికారులను మార్చాలని డీఈఓను ఆదేశించారు. ఈ జిల్లాలోనే సీనియర్లు చాలా మంది ఉన్నారని, వాళ్లను విచారణాధికారులుగా నియమించాలన్నారు. కొందరు ఎంఈఓలు చాలా నిక్కచ్చిగా ఉంటారని, వాళ్లను తీసుకోవాలని డీఈఓకు సూచించారు. అవసరం అనుకుంటే తన దృష్టికి తీసుకొస్తే ఇతర జిల్లాల నుంచైనా విచారణాధికారులను నియమిస్తామన్నారు.

న్యూస్ బాక్స్

ముదిగుబ్బ ఎంపీపీపై చర్యలు తీసుకోండి

రెవెన్యూ శాఖ మంత్రికి గిరిజన నాయకుల వినతి



రెవెన్యూ శాఖమంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఓబుళదేవరచెరువు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను బుధవారం కోరినట్లు గిరిజన సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు విజయవాడలోని ఆయన కార్యాలయంలో మంత్రికి వినతిపత్రం అందించినట్లు చెప్పారు. ఎంపీపీ భూ అక్రమాలపై సిట్‌తో దర్యాప్తు చేయించాలని కోరినట్లు తెలిపారు. (మంత్రి స్పందిస్తూ.. సమగ్ర దర్యాప్తు చేయించి.. గిరిజనులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు అక్కులప్పనాయక్, నాయకులు శ్రీనివాసనాయక్, విష్ణు నాయక్, రవినాయక్, వెంకటేష్‌నాయక్, చిన్నమస్తాన్ ఉన్నారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన

తనకల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని కోటపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. బ్యాడ్‌టచ్, గుడ్ టచ్, హెల్ప్‌లైన్ నెంబర్లు 1098, 100, 112, 181, గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, ఉపాధ్యాయులు, మహిళ కార్యదర్శి ఫాతిమా, ఏఎన్ఎం పద్మ, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పరిపాలనాధికారిగా గజ్జల శ్రీనివాసరెడ్డి



నల్లమాడ, మార్చి5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పరిపాలనాధికారిగా గజ్జల శ్రీనివాసరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. పెనుకొండ పంచాయతీరాజ్ సబ్ డివిజనల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఆయన ఉద్యోగోన్నతిపై పరిపాలనాధికారిగా ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడి పరిపాలనాధికారి రామచంద్రారెడ్డి ఐదు నెలల క్రితం పెద్ద వడుగూరు మండలానికి బదిలీ అయ్యారు.

రహదారి సమస్యపై విచారణ



గ్రామస్థులతో చర్చిస్తున్న తహసీల్దార్ దేవేంద్రనాయక్

నంబులపూలకుంట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ తూపల్లి గ్రామానికెళ్లే రహదారి సమస్యపై తహసీల్దార్ దేవేంద్రనాయక్ బుధవారం ఆరా తీశారు. ఈ గ్రామానికి వెళ్లే రహదారిలో చాలా మంది పట్టాలు ఉన్నాయని, రహదారి సమస్య పరిష్కరించిన తరవాతే ఈ మార్గంలో వెళ్లాలని భూ యజమానులు రోడ్డుకు అడ్డంగా గత నెల 27న రాళ్లు వేశారు. రాకపోకలు ఆగిపోవడంతో ఆ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన బుధవారం ఆ గ్రామానికి వెళ్లి.. గ్రామస్థులతో చర్చించారు. రహదారి అడ్డంగా ఉంచిన రాళ్లను తీయించారు. రహదారి సమస్యను త్వరలోనే శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట సర్వేయర్ జిలాన్, వీఆర్ఓ రఘు ఉన్నారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా పూల శ్రీనివాసరెడ్డి



కదిరి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా తలుపుల మండలం పెద్దన్నవారిపల్లికి చెందిన పూల శ్రీనివాస్‌రెడ్డి ఎంపిక చేసినట్లు వైసీపీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. గతంలో పూల శ్రీనివాసరెడ్డి సీఈసీ సభ్యుడిగా పనిచేశారు.

అడవి బ్రాహ్మణపల్లి తండా భూముల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

ముదిగుబ్బ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొరిగల్లు పంచాయతీ అడవి బ్రాహ్మణపల్లి తండాలో వివాదంలో ఉన్న భూములను ధర్మవరం ఆర్డీఓ మహేష్ బుధవారం పరిశీలించారు. గ్రామస్థులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి, నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఆయన వెంట ముదిగుబ్బ తహసిల్దార్ నారాయణ స్వామి, మండల సర్వేయర్, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు.

దరఖాస్తు చేసుకోండి

ధర్మవరంరూరల్, మార్చి5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతికి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ఈనెల 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ పద్మశ్రీ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.75, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150లు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వచ్చే నెల 20న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 7981171568, 7799004659 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు మహిళా సాధికారతపై అవగాహన

పుట్టపర్తిరూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత, సవాళ్లు, పరిష్కారాలపై జిల్లాస్థాయిలో అవగాహన సదస్సును స్థానిక సాయిఆరామంలో గురువారం నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ విజయ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎస్పీ రత్న, జిల్లా స్థాయి మహిళా అధికారులు పాల్గొంటారన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనపరిచిన ఐదుగురు మహిళలను ఎస్పీ సన్మానిస్తారని డీఎస్పీ చెప్పారు.

ప్రమాదాలు జరగకుండా కొమ్ము కాశారు..!

మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం... అప్రమత్తం చేసిన స్థానికులు



గుంత వద్ద ఉంచిన కొమ్మలు

పుట్టపర్తిటౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పట్టణం.. జిల్లా కేంద్రం... కలెక్టరేట్ సమీపం.. అందులోను ప్రధాన రహదారి.. భూగర్భ మురుగు కాలువల మరమ్మతులో భాగంగా నాలుగు రోజుల క్రితం మున్సిపల్ సిబ్బంది ఇలా గుంత తవ్వారు. అనంతరం ఆ గుంతను పూడ్చకుండా అలాగే వదిలేశారు. కనీసం అక్కడ గుంత ఉన్నట్లు హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. నాలుగు రోజులైనా వారు ఏ మాత్రం పట్టించుకోలేదు. ప్రధాన రహదారిలో ఇలా గుంత ఉండటంతో.. ప్రమాదాలు జరకుండా స్థానికులు ఆ గుంత వద్ద ఇలా కొమ్మలు ఉంచి.. వాహనదారులను అప్రమత్తం చేశారు.

హంద్రీనీవా కాలువపై వంతెనలు నిర్మించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తిరూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హంద్రీనీవా కాలువ చుట్టుప్రక్కల పంటల సాగుచేసే రైతులు తమపొలాల్లోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాలువపై బ్రిడ్జిలు నిర్మించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సాగునీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును విన్నవించారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే పల్లె మాట్లాడుతూ.. తరుగువాళ్ళపల్లి, బుక్కపట్నం మండలంలోని మారాల, కొత్తచెరువు మండలం మీర్జాపురం, పోతులకుంట, పాతదేవరపల్లి, పుట్టపర్తి మండలం పెద్దకమ్మవారిపల్లి ప్రాంతాల్లో వంతెనలు నిర్మించాలని మంత్రిని కోరారు. నియోజకవర్గంలోని 193 చెరువులు, రెండు రిజర్వాయర్లను హంద్రీనీవా నీటితో నింపే ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తీ చేస్తారు. ఇందుకు సంబందించి రైతుల నుంచి భూసేకరణ ఎంత చేశారు.. రైతులకు భూపరిహారం ఎంత చెల్లించారు.. ఇంకా ఎంతమందికి చెల్లించాల్సి ఉంది.. పరిహారం ఎప్పటిలోగా చెల్లిస్తారో తెలిపాలని మంత్రిని కోరారు. చెరువులు నింపడానికి హంద్రీనీవా కాలువల్లో స్లూయజ్‌గేట్లు ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం మూలాన హంద్రీనీవా ప్రాజెక్టు పనులు మందగించాయన్నారు. 193 చెరువులకు ఏపద్దతిలో నీరిస్తారో కనీసం గ్రావిటీ కెనాల్ స్ట్రక్చర్ నిర్మాణం, ఒక్క ఎకరా కూడా భూసేకరణ లేకుండా ప్రాజెక్టుకు దుర్గతి పట్టించారన్నారు. హంద్రీనీవా కాలువపై బ్రిడ్జి నిర్మాణాలకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

గూగుల్‌ను కాదు.. గురువులనే నమ్ముకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సువర్ణ

పుట్టపర్తి రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గూగుల్ కన్నా.. గురువులను నమ్ముకుంటేనే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఆర్డీఓ సువర్ణ, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరక్టర్ విజయ శాంతి అభిప్రాయపడ్డారు. బుధవారం బీడుపల్లి సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన సురక్షిత ఇంటర్నెట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వారు మాట్లాడారు. ఇంటర్నెట్‌ను విద్యార్థులు జ్ఞానాభివృద్ధికి మాత్రమే ఉపయోగించుకోవాలని, వేరే వాటి పట్ల ఆసక్తి చూపి భవిష్యత్తు పాడుచేసుకోవద్దని సూచించారు. సోషియల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతకుముందు విద్యార్థులు సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా మహిళా శిశుసంక్షేమశాఖ పీడీ వరలక్ష్మి, డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సమన్వయకర్త కొండప్ప, జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారి మహేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఖాదర్, ప్రోగ్రాం ఆఫీసర్ మురళి, సోషల్ వర్కర్ ఆనంద్ ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ద్రవజీవామృతం తయారీపై శిక్షణ



ద్రవ జీవామృతం తయారీపై శిక్షణ ఇస్తున్న సభ్యులు

తనకల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబల్లిలో బుధవారం జనజాగృతి ఆధ్వర్యంలో రైతులకు ద్రవజీవామృతం తయారీపై శిక్షణ ఇచ్చారు. దీని తయారీకి ఆవు మూత్రం, పుట్టమన్ను, పప్పుదినుసులపిండి, బెల్లం, ఆవు పేడ అవసరమని, వాటిని కలిసి మూడు రోజులపాటు మురగబెట్టాలని సూచించారు. అనంతరం సవ్యదిశలో కలియపెట్టిన తరువాత బంగారు రంగులోకి మారిన వెంటనే రైతులు తమ పొలాల్లో ఆ మిశ్రమాన్ని పిచికారి చేసుకోవచ్చని సూచించారు. ఇందులో జనజాగృతి ప్రకృతి వ్యవసాయ నిపుణురాలు సుప్రియ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

ధర్మవరంరూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతులనాగేపల్లి గ్రామంలో బుధవారం ఆ గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణతో పాటు పలువురు బీజేపీలోకి చేరారు. వీరికి మంత్రి నియోజవర్గ ఇన్‌ఛార్జ్ హరీష్‌బాబు కండువాకప్పి సాధారంగా ఆహ్వానించారు.

ఏవీ నాటి వెలుగులు..!

- నాడు మూడు పూటలా ధూపదీప నైవేద్యాలు
- నేడు వారానికి ఒకసారి కూడా కష్టమే..
- మాన్యం ఉన్నా.. ఆదాయం సున్నా
- హీనస్థితిలో కురుమాల చెన్నకేశవస్వామి ఆలయం
- పురావస్తు శాఖ ఆధ్వర్యంలో కానరాని అభివృద్ధి
- టీటీడీ స్వాధీనం చేసుకోవాలని భక్తుల ఆకాంక్ష



చెన్నకేశవస్వామి ఆలయం, మూలవిరాట్ (ఇన్‌సెట్లో)

నల్లమాడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురమాల గ్రామం వద్ద గల చెన్నకేశవ స్వామి ఆలయం.. గతంలో భక్తుల రద్దీ.. దూప దీప నైవేద్యాలు.. నిత్యారాధనతో కళకళలాడేది. ఈ ఆలయాన్ని శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. శైవులు, వైష్ణవుల మధ్య యుద్ధాల నివారణ కోసం కృష్ణదేవరాయలు అప్పట్లో చెన్నకేశవస్వామి ఆలయాలను నిర్మించారు. శివుడు, విష్ణువు ఇరువురు ఒక్కటేనని.. బేధాభిప్రాయాలు లేన్న సత్యాన్ని శైవులు, వైష్ణవుల్లో ప్రచారం కోసం చెన్నకేశవ స్వామి ఆలయాల నిర్మాణాలకు రాయలు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అందులో భాగంగానే కురమాలలో చెన్నకేశవస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. గతంలో ఇక్కడ దేవర గుడి గ్రామం ఉండేది. ఈ గ్రామం కాలగర్భంలో కలిసిపోయింది. ఈ ఆలయం వద్ద దాతలు 30 అంకనాల సత్రం నిర్మించి, బావిని తవ్వించారు. చెన్నకేశవస్వామి భక్తులకు విడిది, భోజనాల కోసం వంట గదులు ఏర్పాటు చేశారు. నేటికి బావి బాగానే ఉంది. అయితే సత్రాలన్ని శిధిలమయ్యాయి.

● మాన్యం ఉన్నా..

ఈ ఆలయానికి 20 ఎకరాల మాన్యం భూమి ఉంది. అప్పట్లో గ్రామపెద్దలు, స్వాతంత్ర్య సమరయోధులు తలసాని పెద్దగంగిరెడ్డి, చిన్నగంగిరెడ్డి హయాంలో చెన్నకేశవస్వామికి పూజలు పుష్కలంగా అందాయి. వరుస కరువుల రీత్యా మాన్యం భూమి ఉన్నా, ఉపయోగం లేకుండా పోయింది. మరో మార్గం లేక కురమాల గ్రామ పెద్ద తలసాని కేశవరెడ్డి మాన్యం భూమిలో అప్పటి తహసీల్దార్ వెంకటేశ్వర్‌తో చర్చించి 18 ఏళ్ల క్రితం చింత-నిశ్చింత పథకం ద్వారా చింత మొక్కలు నాటించారు. ఆ తహసీల్దార్ చింత మొక్కల పథకానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రస్తుతం చెట్లు బాగా పెరిగాయి. సరైన నిర్వహణ లేక ఆశించిన ఫలితాలు లేవు. వచ్చిన కొంత పంటకూ రక్షణ లేకపోవడంతో వాటిని తీసుకెళ్లేవారు. దీంతో స్వామి వారికి ఆదాయం లేకుండా పోయింది.

● ఆకతాయిల దుశ్చర్య

గుప్తనిధుల కోసం కొందరు ఆకతాయిలు ఆలయ పరిసరాల్లో తవ్వారు. అంతేకాకుండా ఆలయ గర్భగుడిలో మూలవిరాట్‌నూ పెకలించారు. చెన్నకేశవస్వామి ఆలయం చుట్టు ప్రహరి శిథిలావస్థకు చేరుకోవడంతో కురమాలకు చెందిన భాస్కర్ దాన్ని నిర్మించారు. అలాగే గుడి ఆవరణంలో బండలు వేయించారు.

● టీటీడీపై ఆశలు

ప్రస్తుతం ఈ ఆలయం పురావస్తు శాఖ వారి ఆధ్వర్యంలో ఉంది. దీంతో ఆలయ అభివృద్ధి అటుంచి.. కనీసం సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదని స్వామి వారి భక్తులు వాపోతున్నారు. వారంలో ఒకసారికి కూడా దూపదీపాలకు నోచుకోలేదన్నారు. ఈ ఆలయాన్ని పురావస్తు శాఖ నుంచి టీటీడీ ట్రస్ట్ వారు స్వాధీనం చేసుకుంటేనే అభివృద్ధి సాధ్యమని వారు అభిప్రాయపడుతున్నారు. టీటీడీ ట్రస్ట్ వారు, పాలకులు చొరవ చూపి ఈ ఆలయానికి పూర్వ వైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలని, స్వామి వారికి దూపదీపాలు, నిత్యారాధనకు సహకరించాలని కోరుతున్నారు.



ఆలయం వద్ద ఉన్న కోనేరు



మాన్యం భూమిలో చింత తోపు

క్రైం న్యూస్..

పగలే దుకాణంలో చోరీ

కొత్తచెరువు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పెనుకొండ రహదారి పక్కన పశువుల దాణా దుకాణంలో పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తి బుధవారం చోరీకి పాల్పడ్డాడు. ఓ వ్యక్తి చిల్లర కావాలంటూ ఆ దుకాణం వద్దకు వచ్చాడు. ఆ దుకాణంలోని మహిళ చిల్లర ఇస్తుండగా.. ఆమె చేతిలోని డబ్బులు.. క్యాష్ బాక్స్‌లోని డబ్బులు లాక్కొని పారిపోయాడు. దాదాపు రూ. 15 చోరీకి గురైందని బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే దుకాణంలో చోరీ జరగడం ఇది రెండోసారి. ఇది పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉంది. పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే దొంగతనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

ధర్మవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పట్టణం నుంచి బొలెరో వాహనంలో 26 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తుండగా.. లక్ష్మీచెన్నకేశవపురం సర్కిల్‌లో బుధవారం అడ్డుకున్నట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. వాహనాన్ని, బియ్యాన్ని స్వాధీనం చేసుకొని.. డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

జూదరుల అరెస్ట్

పుట్టపర్తిరూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్ణాటకనాగేపల్లి సమీపం సాహెబ్‌చెరువు గుట్టలో బుధవారం సాయంత్రం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ లింగన్న పేర్కొన్నారు. వారి నుంచి రూ. 51,530ను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

డ్రైనేజీల్లో పూడిక తొలగింపు



డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న నాయకులు

ధర్మవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక స్పందన ఆస్పత్రి నుంచి లక్ష్మీచెన్నకేశవపురం వరకు ప్రధాన రహదారి పక్కన ఉన్న డ్రైనేజీ పూడుకుపోయింది. దీంతో వర్షాలు వచ్చినప్పుడల్లా మురుగునీరు రోడ్లపై పారుతూ తీవ్ర అసౌకర్యానికి కల్గించేది. ఈ పరిస్థితి ఐదేళ్లుగా ఉంది. ఈ విషయాన్ని స్థానికులు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. దీంతో పూడిపోయిన ఆ డ్రైనేజీలను శుభ్రం చేయించేలా చూడాలని ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి భీమనేని ప్రసాద్‌నాయుడికి సూచించారు. ఆయన మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేశవ, సచివాలయ శానిటరీ సెక్రటరీ పుష్పరాజ్‌తో కలిసి.. సిబ్బందితో ఆ డ్రైనేజీల్లో పూడికను బుధవారం తొలగించారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలి



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కదిరిఅర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): హిందూపురం రోడ్డు గట్టు వద్ద ఉన్న టిడ్కో ఇళ్లను పూర్తి చేసి, లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం టిడ్కో ఇళ్లను పరిశీలించిన వారు మాట్లాడారు. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి గత టీడీపీ పాలనలో చేపట్టారని, వైసీపీ ప్రభుత్వం వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా వీటి గురించి ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఇళ్లు అప్పగించకుండానే ఇంటి మీద అప్పు చెల్లించాలని బ్యాంకర్లు లబ్ధిదారులకు నోటీసులు పంపుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. వారి వెంట జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, జీఎల్ నరసింహులు, జగన్, ముస్తాక్, బాబ్‌జాన్, రామమోహన్ ఉన్నారు.

హంద్రీనీవా కాలువ వెడల్పు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న జలసాధన సమితి సభ్యులు

బుక్కపట్నం, మార్చి5 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు వెంటనే నిలిపివేసి, జీడిపల్లి నుంచి చిత్తూరు వరకు కాలువ వెడల్పు చేయాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జానకంపల్లి గ్రామ సమీపంలో హంద్రీనీవా కాలువ వద్ద జరుగుతున్న లైనింగ్ పనులను పరిశీలించిన ఆయన మాట్లాడారు. హంద్రీనీవా మెయిన్ కాలువ నుంచి పిల్లకాలువలు ఏర్పాటు చేసి, రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో 6,02,500 ఎకరాలకు కొత్త ఆయకట్టుద్వారా నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో జల సాధన సమితి ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వాసిన్, జల సాధన సభ్యులు నవీన్, జమీల్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్ఎంయూ వ్యవస్థాపక అధ్యక్షుడికి నివాళి

కదిరిఅర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకుడు రామమోహన్ వర్ధంతిని స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు హరిమోహన్, బైరిశెట్టి, భాస్కర్,బాషా, పాపన్న, గంగాదేవి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



రామమోహన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

న్యూస్ బాక్స్

రీసర్వే సమస్యలు పరిష్కరించండి : జేసీ



రైతులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జేసీ

లేపాక్షి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న రీసర్వేలో భాగంగా రైతుల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లాజాయింట్ కలెక్టర్ అపూర్వభరత్ అన్నారు. మండలంలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కొండూరు, లేపాక్షి గ్రామాల్లో ఈక్రాప్ బుకింగ్‌ను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్ గురించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. మానెంపల్లిలో నిర్వహించే రీసర్వే వివరాలు వచ్చిన సమస్యలను మండల సర్వేయర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, వీఆర్‌ఓలు ఉన్నారు.

మండలంలో పర్యటించిన ఆర్డీఓ

పరిగి, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు సమస్యలపై స్పందనలో వచ్చిన అర్జీలపై బుధవారం ఆర్డీఓ ఆనంద్‌కుమార్ గ్రామాలకు వచ్చి విచారించారు. ఇందులోభాగంగా రెవెన్యూ సదస్సుకు వచ్చిన వన్నంపల్లి గ్రామానికి చెందిన లక్కప్పగారి గంగమ్మ, పరిగి, కురుబ సాకమ్మ, అర్జీలపై ఆరాతీసి సమస్యలు పరిష్కారమయ్యాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలకేంద్రంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీచేసి విద్యార్థుల వసతి గృహాలను, భోజన సౌకర్యాన్ని రోజూ సాయంత్రం ట్యూషన్ నిర్వహిస్తున్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రతపై వార్డెన్‌తో ఆరాతీశారు.

ఎన్నడూలేని విధంగా బీసీ బడ్జెట్



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూలేనివిధంగా బీసీ సంక్షేమానికి బడ్జెట్‌ను ఎన్‌డీఏ కూటమి కేటాయించిందని కన్వీనర్ శ్రీరాములు పేర్కొన్నారు. స్థానికపార్టీ కార్యాలయంలో బుధవారం టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలు, చేనేత కార్మికుల అభివృద్ధికి రూ.150కోట్లు, నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి రూ.150కోట్లు, బీసీ యువత స్వయం ఉపాధి కోసం రూ.897కోట్లు, వడ్డెర కులస్థులకు క్వారీల్లో 10శాతం రిజర్వేషన్లు కేటాయించడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీసీఎం పవన్‌కళ్యాణ్, బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రమణమ్మ, సుబ్రమణ్యం, సాయినరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

8న జాతీయ మెగా లోక్ అదాలత్

పెనుకొండ టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 8న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వాసుదేవన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ అయిన, క్రిమినల్, సివిల్ కేసులు, ప్రీలిటిగేషన్, ఎక్సైజ్ కేసులను పెనుకొండ కోర్టు ఆవరణలో పరిష్కరిస్తామని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


జీతగాళ్లకు పునరావాసం కల్పించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జీతగాళ్లు

పావగడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తాలూకావ్యాప్తంగా జీతగాళ్లుగా గుర్తింపబడిన వారికి ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని జీవిక సంఘటన ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్ నుండి ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులుఅర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని కార్యాలయం ముందు జీత విముక్తి, కర్నాటక నుండి పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వం జీతగాడుగా గుర్తించిన ప్రతి జీతగాడికి ప్రభుత్వం రెండెకరాల పొలం, రూ.2లక్షలు నగదు, ఒకపక్క ఇల్లు నిర్మించి వారి పిల్లలకు విద్యా, ఎదుగుదలకు అన్ని విధాలా ఆదుకోవాలని జీవికె సంఘం జిల్లా కన్వీనర్ సంజీవమూర్తి డిమాండ్ చేశారు. అధికారులు తాలూకా వ్యాప్తంగా ఉన్న జీతగాళ్లను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని తాలూకా కన్వీనర్ నరసింహమూర్తి తెలియపరిచారు. కార్యక్రమంలో హనుమంతరాయ, గంగాధర్, నరసింహయ్య, హనుమంతరాయ, వీరన్న, పద్మక్క, రామప్ప, అనేక మంది జీతగాళ్ల ఈ కార్యక్రమంలో పాల్గొని తమ డిమాండ్లతో వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.

జీఓ నంబరు 77 రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిందూపురం అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓ నెం 77 విద్యార్థులపట్ల శాపంగా మారిందని, దానిని వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ వెంకటేష్‌కు వినతి అందించారు. విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం పీజీ ఎంట్రెన్స్ టెస్టు విధానం తీసుకురావడంతో యూనివర్సీటీలోని పలు విభాగాలను విద్యార్థులు లేక మూసి వేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. 10 లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరమైనారని ఆగ్రహించారు. మంత్రి తన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకటేష్, మహేష్ పాల్గొన్నారు.

దిష్టి ట్యాంకులు

- వేసవిలో రానున్న తాగునీటి కష్టాలు
- నిరుపయోగంగా ట్యాంకులు



సీ కోడిగేపల్లిలో పనిచేయని ఓహెచ్ఎస్ ట్యాంక్

మడకశిర రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాలో తాగునీటి సమస్యలు రాకుండా ముందుచూపుతో నీటిట్యాంకులు నిర్మించారు. ఇందు కోసం కోట్లాదిరూపాయలు వెచ్చించారు. ఆ బులుపు తీరకుండానే వాటి వాడకాన్ని బంద్ చేశారు. ఐదేళ్లుగా పంచాయితీల్లో వీటిని వాడకుండా పాడుబెట్టారు. దీంతో అవి గ్రామనడిబొడ్డున దిష్టిబొమ్మల్లా మారిపోయాయి. క్రమేపీ ఆ ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో కోట్లాది రూపాయిల ప్రజాధనం నిరుపయోగంగా మారిందని ప్రజలు వాపోతున్నారు.

మండలంలో 16 పంచాయితీల పరిధిలో 110 గ్రామాలు ఉన్నాయి. వాటిలో 360 ఓహెచ్ఎస్ ట్యాంకులు, 250 వరకు జీఎల్ ఆర్ ట్యాంకులను నిర్మించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నప్పటికీ ఈ ట్యాంకుల ద్వారా గ్రామాలో తాగునీటి సమస్యలు రాకుండా నిరంతరం నీరు అందించేవారు. ప్రస్తుతం పంచాయితీ,ఆర్ డబ్ల్యూఎస్ శాఖ అధికారులు బోర్ల నుంచి నేరుగా ఇళ్ళు కొళాయిలకు కనెక్షన్ ఇచ్చారు. దీంతో విద్యుత్ ఉన్న సమయంలో మాత్రమే తాగునీరు వస్తాయి. విద్యుత్ సరఫరాలేక పోతే ఆరోజు గ్రామంలో తాగునీటి సమస్య ఎదుర్కోక తప్పదు. ఈ విధంగా గ్రామాల్లో తరచు నీటి సమస్యలు అధికం అవుతున్నాయి.

ఆమిదాలగొంది పాఠశాల ప్రక్కన పది ఏళ్ల క్రితం రూ.8 లక్షలతో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మించారు. గ్రామ సమీపంలోని చెరువులో బోరు వేసి పైపులైన్ ద్వారా ట్యాంకులకు నీరు పంప్‌చేసి, ఆ ట్యాంకు నుంచి గ్రామానికి తాగునీరు అందించేవారు. వేసవిలో తాగునీటి సమస్యలు వచ్చేవి కాదు. భక్తరహళ్ళి గ్రామంలో జీఎల్ఆర్ ట్యాంకును నిర్మించారు. గ్రామస్థులకు, దేవాలయానికి వచ్చే భక్తులకు ఎంతో అనుకూలంగా ఉండేది. బోరు నుంచి వచ్చే పైపులైన్స్ పగిలిపోవడంతో వాటిని తొలగించి నేరుగా పబ్లిక్ కొళాయిలకు కనెక్షన్ ఇవ్వడంతో విద్యుత్ లేకుంటే ఆగ్రామంలో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కోవలసివస్తోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోని వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు: విజయకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మడకశిర

వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకోంటున్నాం. నీటి సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి అక్కడ ఇప్పటికే 10 బోర్లు వేశాం. వచ్చే వారంలో మరో ఆరు బోర్లు వేస్తున్నాం. బోరు వేసి వాటికి మోటర్లు అమరుస్తామని తెలిపారు. ఓహెచ్ఎస్ ఆర్ ట్యాంకులకు నీరు అందిస్తున్నట్లు తెలిపారు.

ట్యాంకులను శుభ్రం చేయడంలేదు



నారాయణప్ప, కల్లుమర్రి

మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఉన్న ఓహెచ్ఎస్ ఆర్ ట్యాంకులను అధికారులు శుభ్రం చేయడంలేదు. చాల గ్రామాల్లో ట్యాంకుకు అమర్చిన పైపులైన్‌లు పగిలిపోవడంతో మరమ్మతులు చేయకుండా వాటిని వదిలివేశారు ప్రస్తుతం చాల ట్యాంకులు నీరు లేక నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి.

ఉపాధి అవినీతి నిగ్గు తేలేనా..?

గుడిబండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకం కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక బృందం అవినీతి అక్రమాల నిగ్గుతేల్చేనా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేయించిన ఫీల్డ్‌అసిస్టెంట్‌లు చేయని పనులను నమోదు చేసి మస్టర్‌లో పనులు చేయని కూలీల పేర్లు నమోదుచేసి నిధులను భారీగా స్వాహా చేశారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. మండలంలోని సి.సి.గిరి, ముతుకూరు, గుణేమోరుబాగల్, మోరుబాగల్, శంకరగల్లు, రాళ్లపల్లి, జంబులబండ, కొంకల్లు, గుడిబండ, దేవరహట్టి, తాళికెర, తదితర గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉపాధి హామీ నిధులను భారీగా స్వాహా చేశారు. గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్డుకు ఇరువైపులా అవిన్యూ ప్లాంటేషన్ ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే తూతూ మంత్రంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు భారీగా నిధులు ఖర్చుచేసి స్వాహా చేశారు. అయితే ఉపాధి పథకం ద్వారా రోడ్డుకు ఇరువైపులా చెట్లు నాటి ఉంటే ఒక్కటి కూడా పెరిగిన దాఖలాలు ఎందుకు లేవని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీపథకం ద్వారా నిధులను భారీగా స్వాహా చేశారు. మండలంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం పకడ్బందీగా తనిఖీలు చేపట్టి అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా ఉపాధి నిధులు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకొని రికవరీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

లారీని ఆపి.. గాలి తీసేసి..!

- కియ వద్ద టీడీపీ నాయకుల హల్‌చల్
- మంత్రి జోక్యానికి లారీ అసోసియేషన్ వినతి



లారీ టైర్లలో గాలితీసేసిన దృశ్యం (ఫైల్)

సోమందేపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని చాలకూరు వద్ద కియ అనుబంధ పరిశ్రమ సమీపంలో స్థానిక టీడీపీ నాయకులు మంగళవారం హల్‌చల్ చేశారు. స్క్రాప్ తరలించేందుకు వెళ్లిన ఓ లారీని అడ్డుకుని, టైర్లలో గాలి తీసేశారు. ఆ లారీ వీడియోను అసోసియేషన్ అధ్యక్షుడు ఇర్షాద్ బుధవారం సోషల్ మీడియాలో పెట్టారు. తమలాంటివారికి నష్టం కలిగిస్తే ఏమొస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆడియోను పోస్టు చేశారు. కియకు స్పేర్‌పార్ట్స్ అందించే అనుబంధ సంస్థవారు స్క్రాప్, మెటీరియల్ రవాణా కోసం పెనుకొండ లారీ అసోసియేషన్ నుంచి ఐదేళ్లుగా లారీలను తెప్పించుకుంటున్నారు. ఇదే తరహాలో హైదరాబాద్‌కు లోడ్ తరలించేందుకు మంగళవారం ఓ లారీని మాట్లాడుకున్నారు. ఆ కంపెనీలో లోడింగ్ చేసుకునేందుకు వెళ్లిన లారీని టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. డ్రైవర్‌ను బెదిరించి, టైర్లలో గాలి తీసేశారు. ఇంకోసారి లోడ్‌కోసం వస్తే లారీ అద్దాలను ధ్వంసం చేస్తామని, బయట తిరగకుండా చేస్తామని హెచ్చరించారు. ఈ ఘటనపై ఇర్షాద్ ఆవేదన వ్యక్తం చేశారు. తాము పేద వారమని, అధికార పార్టీ నాయకులు తమలాంటివారిపై దౌర్జన్యం చేయడం సరికాదని అన్నారు. కాంట్రాక్ట్ కావాలనుకుంటే నేరుగా సంస్థ యజమానులతో మాట్లాడుకోవాలని, తాము అడ్డుచెప్పబోమని అన్నారు. ఇలాంటి సమస్యలపై మంత్రి సవిత స్పందించాలని కోరారు. సోషల్ మీడియాలో ఈ వ్యవహారం వైరల్ కావడంతో టీడీపీ నాయకులు దిద్దుబాటు చర్యకు దిగారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా చూసుకున్నారు. వివాదంతో తమకు సంబంధం లేదని కియ అనుబంధ సంస్థ మేనేజర్ షబ్బీర్ అన్నారు. బయటి వ్యక్తులు, నాయకుల మధ్య జరిగిన గొడవ అని అన్నారు. ఈ వివాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేని ఎస్ఐ రమేష్ అన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి బోరుకు పూజలు చేస్తున్న మహిళలు

గుడిబండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.డి.పాళ్యం గ్రామంలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. వారు కొత్తగా బోరు తవ్వించారు. దానికి మోటారు బిగించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఇతర అధికారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

బాలింత ప్రీతి నెలసరి చెకప్‌ల పరిశీలన

హిందూపురం అర్బన్, మార్చి 5,(ఆంధ్రజ్యోతి): హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరి తరువాత అధిక రక్తస్రావంతో మృతి చెందిన బాలింత ప్రీతి(27) కేసుపై డిసిహెచ్ స్పందించారు. దీనిపై బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. మంగళగిరి కమిషనర్‌ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలి, సత్యసాయి జిల్లా డిఎంహెచ్ఓ ఫైరోజబేగం ఆదేశాల మేరకు ఇమ్యునైజేషన్ అధికారి శ్రీనివాసరెడ్డి ప్రాథమిక విచారణ చేశారు. ప్రీతి ప్రతి నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళి బిపి చెక్ చేసుకున్నారా? టీటీ ఇంజక్షన్ వేయించుకున్నారా? ఐరన్ పోలిక్ మాత్రలు తీసుకున్నారా? తదితర సమాచారాన్ని, నెలసరి హెల్త్ చెకప్‌లను పరిశీలించి రికార్డు చేసుకొని ఉన్నతాధికారులకు అందించారు. వైద్యవిధాన పరిషత్ నుంచి ఉన్నతాధికారులు వచ్చి హిందూపురం ఆసుపత్రిలో విచారిస్తారన్నారు.

విధులకురాని వైద్యులకు షోకాజ్ నోటీసులు

హిందూపురం అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజీ వైద్యులు డాక్టర్ నందిత, డాక్టర్ నాగసింధులు విధులకు హాజరు కానందున ఇంతకు ముందే షోకాజ్ నోటీలు ఇచ్చామని సూపరింటెండెంట్ లింగన్న పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం ఫోన్‌లో కూడా మాట్లాడుతూ విధులకు హాజరు కావాలని తెలిపామన్నారన్నారు. నందిత ప్రభుత్వ వైద్యంకు రాలేనని రిజైన్ చేసినట్లు లెఖ అందించారని, నాగసింధు సమాధానం చెప్పలేదన్నారు. ఈ విషయాలను ఉన్నతాధికారులకు పంపపామన్నారు. ప్రస్తుతం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు గైనకాలజీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రజావసరా లను దృష్టిలో ఉంచుకొని తర్వరలో వాటికి నోటిఫికేన్ వెలువడవచ్చని ఆయన తెలిపారు.

హేమావతి హెంజేరు సిద్దేశ్వర స్వామి హుండీ లెక్కింపు

అమరాపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్, ఈఓ నరసింహరాజు, గ్రామస్తుల సమక్షంలో పోలీసుల ఆధ్వర్యంలో పత్రికా సంపాదకుల ముందు హుండీ లెక్కింపు ప్రారంభించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీ ఆదాయం రూ.9,27,763 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఈఓ నరసింహరాజు తెలిపారు. గత సంవత్సరం బ్రహ్మోత్సవం కంటే ఈబ్రహ్మోత్సవంలో రెండింతలు హుండీ ఆదాయం పెరిగిందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్, ఈఓ నరసింహరాజు, పోలీసు సిబ్బంది గొల్లమారనపల్లి రామచంద్రప్ప, మాజీ సర్పంచు కుమారస్వామి, పంచాయతీ కన్వీనర్ తిప్పజ్జ, ఎంపీటీసీ ఓంకార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

పెనుకొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ తమవంతు కృషిచేయాలని సీడీపీఓ శాంతలక్ష్మీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీడీపీఓ శాంతలక్ష్మీ అధ్యక్షతన ఆలయ పురోహితులు చర్చి పాస్టర్లు, ఇమాంలు, కళ్యాణమండపం యజమానులకు బాల్యవివాహాల నిర్మూలనకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడంవల్ల, వాటి పర్యావసనాలు, కష్టాలు, నష్టాలు మొదలైన వాటిపై అవగాహన కల్పించారు. బాలికలకు 18, బాలురకు 21సంవత్సరాలు నిండి ఉంటేనే వివాహాలు చేయాలని అప్పుడే వారు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై ఇన్చార్జ్ ఎంపీడీఓ, మతపెద్దలచేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్థానిక సత్యసాయి కళాశాలలో సీడీపీఓ శాంతలక్ష్మీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్, సూపర్‌వైజర్లు అనురాధ, పుష్ప, యర్రమ్మ, మహిళా సంరక్షణ కార్యదర్శి రాదమ్మ పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళలదే కీలక పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ రాజేశ్వరి

గోరంట్ల, మార్చి5 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని సీడీపీఓ రాజేశ్వరీ తెలిపారు. మండలంలోని మండలపల్లి ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలోని బాలికలతో జరిగిన సమావేశంలో మార్చి 8న అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ప్రభుత్వ సహకారంలో పండుగలా జరుపుకుంటున్నామని చెప్పారు. మహిళల హక్కులు, సమాజంలో వారి పాత్ర గురించి వివరించారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్‌కుమార్

పెనుకొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీఎస్‌టీఏ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం స్థానిక వీఆర్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఏపీఎస్‌టీఏ మండల కార్యవర్గ సమావేశాన్ని మండలాధ్యక్షులు విజయ్‌కుమార్ నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్‌కుమార్ హాజరై మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిటీ ఆలస్యం అవుతున్నందున ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 30శాతం మధ్యంతర భృతి, ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించి పీఆర్‌సీ, పెండింగ్ డీఏ బకాయిలు చెల్లించాలని సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్‌నాయక్, విజయ్‌కుమార్, హెచ్‌బాబు పాల్గొన్నారు.

రేపు శ్రీవారి పుష్కర గోపురాలకు కుంభాభిషేకం

మడకశిరటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పుష్కర గోపురాల కుంబాభిషేకం నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఈనెల 7వతేదీ నుండి 10వతేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. 7వతేదీన ఉదయం 9 గంటలకు తిరుమంజనం, వాసుదేవ పుణ్యాహ వాచనం, గోపుర కలశ జలాదివాసం, 8వతేదీన ద్వారారాధన తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి: జీఎం శేఖర్



బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్

గోరంట్ల, పెనుకొండ టౌన్, మార్చి5 (ఆంధ్రజ్యోతి) :సీపీఐ నాయకుడు రామక్రిష్ణ వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను విమర్శిస్తూ మాట్లడడం మంచిదికాదని బిజెపి జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారన్నారు. అలాగే పార్టీలో చేరినవారంతా ఆయన విజయం కోసం కృషి చేశారన్నారు. అలాంటివారు మంత్రి వెంటకానీ, కారులో తిరిగినంత మాత్రాన వారి వ్యవహారాలు మంత్రికి ఆపాదించడం సరికాదన్నారు. ఏపార్టీ వారినైనా విమర్శించే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు.

వాటర్ యాపిల్ మొక్కలు దగ్ధం



కొండకు నిప్పుపెట్టడంతో దగ్ధమైన వాటర్‌యాపిల్ మొక్కలు

పెనుకొండ రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోలార్ కంపెనీ పక్కన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కొండకు నిప్పుపెట్టడంతో వాటర్‌యాపిల్ మొక్కలు కాలిపోయాయని కురుబవాండ్లపల్లి సర్పంచ్ నాగమూర్తి వాపోయారు. గత రెండేళ్ల క్రితం తనకున్న రెండున్నర ఎకరాల్లో విజయవాడ నుంచి వాటర్‌యాపిల్ మొక్కలను తీసుకొచ్చి నాటినట్లు తెలిపారు. ఒక్కో మొక్కకు రూ.420 చొప్పున 600 మొక్కలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీటికి డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేసి మొక్కలు సాగుచేస్తున్నట్లు తెలిపారు. ఈ వాటర్ యాపిల్‌ను షుగర్ వ్యాధినివారణకోసం వాడతారన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు కొండకు మంగళవారం నిప్పుపెట్టడంతో చెట్లన్నీ కాలిపోయినట్లు తెలిపారు. చెట్లు, డ్రిప్ పరికరాలు పూర్తిగా కాలిపోయి రూ.1.5లక్షలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

మామిడి, చింత చెట్లకు నిప్పు రూ.80 వేల నష్టం

మడకశిర రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌడనహళ్ళి గ్రామానికి చెందిన నారాయణప్ప, సంజీవప్పల పొలాల్లో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. చుట్టుపక్కల రైతులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి వెంటనే మంటలు అదుపుచేశారు. నారాయణప్ప చింతచెట్లు కాలిపోవడంతో రూ.50 వేలు, సంజీవప్ప మామిడిచెట్లు కాలిపోవడంతో రూ.30 వేలు నష్టం వాటిల్లిన్నట్లు రైతులు తెలిపారు. తమకు ఆర్థిక సహాయం అందించాలని రైతులు కోరారు.

మహిళలతో గొడవపడి.. ఆత్మహత్య

అమరాపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాచికుంట గ్రామానికి చెందిన గోవిందప్ప(50) తన ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నారు. పోలీసులు తెలిపిన మేరకు, ఇంటి పక్కన ఉన్న మహిళలతో ఆయన గొడవపడ్డారు. బయటకు వస్తే కొడతామని వారు బెదిరించారు. తనపై మహిళలు దాడి చేస్తే గ్రామంలో అవమానం జరుగుతుందని భయపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ సమయంలో భార్య, కుమారుడు బెంగళూరు ఆస్పత్రికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం రాత్రి ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న భార్య గుండమ్మ స్వగ్రామానికి చేరుకున్నారు. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని ఎస్ఐ ఇసాక్‌బాషా తెలిపారు..

కుటుంబ కలహాలతో...

సోమందేపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మండలంలోని పత్తికుంటపల్లి గ్రామంలో అఫ్సాన్‌సాబ్(58) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అఫ్సాన్‌సాబ్‌కు మొదటి భార్య షకీలాబీ ఉండగా ఐదేళ్ల క్రితం సయ్యద్‌జైనబ్‌బీను రెండో వివాహం చేసుకున్నాడు. షకీలాబీకి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో భార్యకు ఒక కుమార్తె ఉంది. కంకరపని చేసుకుని జీవనం సాగించే అఫ్సాన్‌సాబ్‌కు రెండో భార్య మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవన్నారు. ఈ క్రమంలో అనుమానం పెంచుకున్న అఫ్సాన్‌సాబ్ మనస్థాపానికి గురై ఊరిబయట ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ

మడకశిర టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకం, బ్యూటీషియన్‌కోర్సు, టైలరింగ్ కోర్సులకు శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పాస్ లేక ఫెయిల్ ఆపై చదివిన వారు అర్హులు అన్నారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు శిక్షణ తరగతులకు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.